మన మీ.. వార్త

ప్రతి అక్షరం... ప్రజల కోసం

TGBIL/25/A0512

ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం
28 అక్టోబర్ 2026

పేజీలు : 6

@mvaartanews

www.mivaartanews.com


# ప్రస్తుత పంటను అన్ని విధాలా కాపాడాలి, యాసంగిలో వరి సాగు చేయవద్దు.

- కరువు పరిస్థితులు, భూగర్భ జలాల తగ్గుదలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి.
- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.

**ఖమ్మం అక్టోబర్ 27 మీ వార్త ప్రతినిధి:**

ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడుతున్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత వానాకాలం పంటను అన్ని విధాలా కాపాడాలని, రాబోయే యాసంగి సీజన్‌లో వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఖమ్మం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్‌లతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత శాఖల అధికారులతో ఎల్‌నినో పరిస్థితులపై సమీక్షించారు. ఈ సందర్భంగా నీటి పారుదల, మిషన్ భగీరథ, వ్యవసాయం, భూగర్భ జలాలు, మార్కెటింగ్, విద్యుత్, వైద్యారోగ్య శాఖల అధికారులు తమ శాఖల ప్రస్తుత పరిస్థితులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కరువు పరిస్థితులు, మండలాల వారీగా భూగర్భ జలాలు తగ్గుతున్న తీరుపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాలని అన్నారు. ఈ నెలాఖరు నాటికి, వచ్చే నెలలో భూగర్భ జలాల పరిస్థితి ఎలా ఉండబోతుందనే అంచనాలను ప్రజలకు వివరించాలని, అధికారులు ఎప్పటికప్పుడు మీడియా సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని

సూచించారు.ప్రస్తుతం రైతులు ఎంతో కష్టపడి సాగు చేస్తున్న వానాకాలం పంటను కాపాడేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రెండవ పంట సాగు చేస్తే రైతులు భారీగా నష్టపోయే ప్రమాదం ఉందని, ఈ విషయాన్ని రైతులకు స్పష్టంగా వివరించాలని సూచించారు. యాసంగిలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యం రాబోయే యాసంగి సీజన్‌లో సాగునీటి లభ్యత ఉండే అవకాశం లేదని మంత్రి తెలిపారు. రైతులు అధిక నీరు అవసరమయ్యే వరి సాగుకు దూరంగా ఉండాలని, పప్పుధాన్యాలు, చిరు ధాన్యాలు, కూరగాయలు, ఇతర తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని సూచించారు.ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలను ముందుగానే అందుబాటులో ఉంచాలని, రైతులు నష్టపోకుండా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఉద్యాన పంటలను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, బిందు సేద్యం ఏర్పాట్లను వేగవంతం చేయాలని సూచించారు.రెండవ పంటకు సంబంధించి స్థానిక పరిస్థితులను బట్టి తక్కువ నీటితో పండే పంటలకు తడులు అందించే అవకాశాలను పరిశీలించాలని అన్నారు. ఎక్కడా పంట వ్యర్థాలను తగులబెట్టకుండా చూడాలని, పంట వ్యర్థాలు తగులబెట్టిన ఘటనలు చోటుచేసుకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్రాగునీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యం ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని త్రాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. కిన్నెరసాని నీటిని యాసంగి పంటలకు విడుదల చేయవద్దని, అవసరమైతే మిషన్ భగీరథ త్రాగునీటి అవసరాలకు వినియోగించాలనిఆదేశించారు.నాగార్జునసాగర్ పరిధిలోని రెగ్యులేటర్లు, షట్టర్లు, పంపిణీ వ్యవస్థలను





మూసివేసి, పాలేరు వరకు ప్రధాన కాలువల్లో నీటిని నిల్వ ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువలో మూడు పంప్‌హౌస్‌లను వినియోగించి సాధ్యమైనంత ఎక్కువ నీటిని నిల్వ చేయాలని తెలిపారు.పాలేరు రిజర్వాయర్ మూడు జిల్లాల త్రాగునీటి అవసరాలకు ఉపయోగపడేలా నీటి నిల్వలను సమర్థంగా నిర్వహించాలని అన్నారు. దుమ్ముగూడెం టెయిల్‌పాండ్ సమీపంలో ఇసుక బస్తాలతో అడ్డుకట్టను పెంచి సుమారు1టీఎంసీ నీటిని నిల్వ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు అధికారులు తెలిపారు.అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఈ ఏడాది నీటి ఆవిరి నష్టాలు, ఇంకుడు నష్టాలు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. మిషన్ భగీరథ నీటి సరఫరా సమయాలను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నియంత్రించాలని, పైపులైన్ల లో లీకేజీలను అరికట్టి నీరు వృథా కాకుండా చూడాలని ఆదేశించారు. వచ్చే ఏడాది జూలై వరకు త్రాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. త్రాగునీటిని వాహనాల శు భ్రత, తోటల పెంపకం వంటి అవసరాలకు వినియోగించకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. నీటి వినియోగాన్ని క్రమంగా తగ్గించుకునే అలవాటును ప్రజల్లో పెంపొందించాలని సూచించారు. పాత త్రాగునీటి పథకాల పునరుద్ధరణకు చర్యలు మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు ప్రత్యామ్నాయంగా ఉపయోగపడేలా గ్రామాల్లో పాత త్రాగునీటి సరఫరా పథకాలను పునరుద్ధరించాలని మంత్రి ఆదేశించారు. గ్రామాల్లో త్రాగునీటి పథకాల పునరుద్ధరణకు అవసరమైన నిధులు, ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులకు తెలిపారు. ప్రతి గ్రామంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకుంటూ త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని అన్నారు. నీటి సంరక్షణ పనులను విస్తృతంగా చేపట్టాలి. ప్రస్తుత కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో నీటి సంరక్షణకు పెద్ద ఎత్తున చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. వీబీ జీ రామ్‌జీ పథకం నిధులతో ఇంకుడు గుంతలు, బోరు రీచార్జి గుంతలు, వ్యవసాయ కుంటలు వంటి నీటి సంరక్షణ నిర్మాణాలను విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. వీబీ-జీ రామ్‌జీ పథకం క్రింద రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు సమకూర్చాల్సి ఉన్న నేపథ్యంలో, అందుబాటులో ఉన్న సుమారు రూ.7,000 కోట్ల నిధులను సమర్థంగా వినియోగించు కోవాలని తెలిపారు. ఖమ్మం జిల్లాలో గ్రామీణ ప్రాంతాలకు ఉపయోగపడే పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఆదేశించారు. పశుగ్రాసం కొరత నివారణకు చర్యలు గ్రామాల్లో పశుగ్రాసం ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. ప్రతి గ్రామంలో పచ్చిగడ్డి పెంపకాన్ని ప్రోత్సహించి పశుగ్రాసం కొరతను అధిగమించాలని తెలిపారు. పశువులకు తగినంత నీరు అందించేందుకు అవసరమైన ప్రాంతాల్లో నీటి తొట్టెలను ఏర్పాటు చేయాలని సూచించారు.పత్తి, ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించాలి పత్తి, ధాన్యం కొనుగోళ్లను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. మార్కెట్‌లో పంటలకు లభిస్తున్న ధరల ప్రయోజనం రైతులకు అందేలా చూడాలని, ఎక్కడా బ్లాక్ మార్కెటింగ్, సిండికేట్లు ఏర్పడకుండా మార్కెటింగ్ శాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.రైతులు పండించిన పంటలకు సరైన ధర లభించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. వ్యవసాయ విద్యుత్ సరఫరా సమయాలపై రైతులకు ముందుగానే సమాచారం అందించాలని, మోటార్లకు ఏర్పాటు చేసిన ఆటో స్టార్టర్లను తొలగించాలని ఆదేశించారు. ఎండిపోయిన బోర్లను వినియోగించకుండా చూడాలని తెలిపారు. మున్సిపాలిటీలు, గ్రామాల్లో వీధి దీపాలను దశలవారీగా సౌర విద్యుత్‌తో నిర్వహించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.1986లో సుమారు 600 గ్రామాలు వరదల కారణంగా ముంపునకు గురైన సమయంలో ప్రజలకు ఆహారం, త్రాగునీరు అందించి అధికారులు సమర్థంగా పనిచేశారని మంత్రి గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో ప్రస్తుత పరిస్థితుల్లోనూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో 10 మండలాల్లో తీవ్ర కరువు, 7 మండలాల్లో సాధారణ కరువు పరిస్థితులు ఉన్నాయని వివరించారు.కామేపల్లిమధిర, ఏన్కూరు, సత్తుపల్లి, ఎర్రుపాలెం మండలాల్లో భూగర్భ జలాలు గణనీయంగా పడిపోయాయని, ఆయా ప్రాంతాల్లో త్రాగునీటి సమస్యలు కూడా ఉన్నాయని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా వైరా, లంకాసాగర్ జలాశయాలను నింపుకోవడంతో పాటు నాగార్జునసాగర్ ఆయకట్టుకు కొంతమేర సాగునీరు అందించగలిగామని వివరించారు. రాబోయే యాసంగి సీజన్‌కు సాగునీరు అందుబాటులో లేదని, రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. మధిర, ఏన్కూరు తదితర నాలుగు మండలాల్లో పశుగ్రాసం కొరత ఏర్పడే అవకాశం ఉందని, ఈ విషయంపై ప్రభుత్వానికి నివేదిక పంపామని, అవసరమైన పశుగ్రాసాన్ని సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ గత సంవత్సరంతో పోలిస్తే జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా భూగర్భ జల మట్టాలు సుమారు3.5 మీటర్లు తగ్గిపోయాయని పేర్కొన్నారు. వానాకాలం పంటల సాగులో భాగంగా సుమారు 40 వేల ఎకరాల్లో వరికి బదులుగా ఇతర పంటలను సాగు చేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. భూగర్భ జలాలు మరింత తగ్గకుండాసంబంధిత అధికారులను అప్రమత్తం చేశామని, కొత్తగా బోర్లు వేయకుండా అవసరమైన చర్యలు చేపట్టామని వివరించారు.రాబోయే ఆరు నెలల పాటు త్రాగునీటి సరఫరాకు అవసరమైన నీరు అందుబాటులో ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఉమ్మడి జిల్లా వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# డాడీ లంబాడీ ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలి.

- ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించిన డుంగ్రోత్ శేఖర్ నాయక్.





**ఖమ్మం అక్టోబర్ 27 మీ వార్త ప్రతినిధి:**

డాడీ లంబాడి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు రుడావత్ రఘునాయక్ ఆదేశాల మేరకు ఖమ్మం నగరంలో నివసిస్తున్న డాడీ లంబాడీ ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని డాడీ లంబాడీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యదర్శి డుంగ్రోత్ శేఖర్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డాడీ లంబాడీ ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన పెండింగ్ చివరి బిల్లులను వెంటనే విడుదల చేయాలని, అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని,ఎస్టీ రుణాలు మంజూరు చేసి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.డాడీ లంబాడీ ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు డాడీ లంబాడీ హక్కుల సాధన సమితి తరఫున ఖమ్మం ఆర్డీఓ కార్యాలయంలో ఇన్‌చార్జి అధికారికి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.ప్రభుత్వం స్పందించి డాడీ లంబాడీ ప్రజల సమస్యలను పరిష్కరించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డుంగ్రోత్ శేఖర్ నాయక్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డుంగ్రోత్ కిషోర్ నాయక్, ధోణవాన్ శ్రీను, ధోణవాన్ నాగరాజు, ధోణవాన్ కీర్తి, డుంగ్రోత్ రమేష్, డి పుష్ప, సరిత, డి రాజేష్, దేవత్ కాళిదాస్, రత్నావత్ ఉపేందర్, డి.మోతి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు చేయూత.

- ఖమ్మం లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్ శిక్షణ అవకాశం.

**ఖమ్మం అక్టోబర్ 27 మీ వార్త ప్రతినిధి:**



ఖమ్మం లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు మహిళ ఆర్థిక చేయూత ఎంతో అవసరం. అందులో భాగంగా సంఘ సేవకురాలు అంజలి నేతృత్వంలో మహిళలకు ప్రత్యేకంగా టైలరింగ్ లో శిక్షణ కార్యక్రమాన్నినిర్వహిస్తున్నారు. ఖమ్మం ఘట్టయ్య సెంటర్లోని బోడెపుడి స్థూపం పక్కన టైలరింగ్ తో పాటు మహిళలకు ఆర్థికంగా స్వయం సమృద్ధి కావాలని వారికి శిక్షణఇస్తున్నామని ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఆమె అన్నారు. ఈ టైలరింగ్ శిక్షణకు ఖమ్మం నగరంలో ఉన్న మహిళలు ఉపయోగించుకోవాలని నిర్వాహకులు చావా లావణ్య 8520846888 ను సంప్రదించాలని కోరారు.

# అర్హులైన పట్టభద్రులందరికీ ఓటు హక్కు కల్పించాలి: ఎమ్మెల్యే జారె.

- ములకలపల్లి మండలంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు కేంద్రాల సందర్శన



**ములకలపల్లి అక్టోబర్ 27 మీ వార్త ఆర్ సి వనమాల శ్రీనివాసరావు:**

త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకునేలా నాయకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సూచించారు. మంగళవారం ములకలపల్లి మండలంలోని కమలాపురం, ములకలపల్లి, చాపరాలపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ ఓటరు నమోదు కేంద్రాలను సందర్శించి నమోదు ప్రక్రియను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో ఓటరు నమోదు కోసం చేపడుతున్న కార్యక్రమాలపై నాయకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన పట్టభద్రులకు ఓటరు నమోదుపై పూర్తి అవగాహన కల్పించాలని ఎవరూ తమ ఓటు హక్కును కోల్పోకుండా గ్రామాల వారీగా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. నమోదు ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి అర్హులైన ప్రతి ఒక్కరూ నిబంధనల ప్రకారం నమోదు చేసుకునేలా సహకరించాలని తెలిపారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉండేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు జహీర్, పేటేటి నరసింహారావు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జూపల్లి కోదండవెంకట రామారావు, నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పాలకుర్తి సుమిత్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు కొడిమే వంశీ, సర్పంచ్ కోర్స చంద్రలేఖ, కారం సుధీర్, గాడి తిరుపతి రెడ్డి, నల్లమోతు జగదీష్, సున్నం సుధాకర్, మడకం చిరుమప్ప, కటికనేని ఆదిత్య, దుగ్గి సంపత్ కుమార్, అచ్చన వెంకటేశ్వరరావు, శనగపాటి అంజి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ములకలపల్లి మండలంలో జోనల్ స్థాయి ఎస్ జి ఎఫ్ ఐ స్కూల్ గేమ్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే జారె.

**ములకలపల్లి అక్టోబర్ 27 మీ వార్త ఆర్ సి వనమాల శ్రీనివాసరావు:**





క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ పట్టుదల నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయి.ములకలపల్లి మండలంలోని ఏ హెచ్ ఎస్ కమలాపురం హాస్టల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-14 నుంచి అండర్-17 విభాగాల బాలబాలికల జోనల్ స్థాయి పాఠశాల క్రీడా పోటీలను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసానికి దోహదపడతాయని పేర్కొన్నారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం ,పట్టుదల, జట్టుగా పనిచేసే నైపుణ్యాలు పెంపొందుతాయని తెలిపారు. క్రీడా పోటీల్లో గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.వి సత్యనారాయణ, ఎంఈఓ జి. సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జహీర్, కారం సుధీర్, కుంజా వినోద్, కాంగ్రెస్ నాయకులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ చికిత్సలో యశోద హాస్పిటల్స్ కీలక ముందడుగు.

- హైటెక్ సిటీలో అత్యాధునిక ఎన్‌జీఎస్ సాంకేతికత ప్రారంభం.

ఖమ్మం అక్టోబర్ 27 మీ వార్త ప్రతినిధి:




క్యాన్సర్‌ను ముందస్తుగా, కచ్చితంగా గుర్తించి రోగులకు మెరుగైన చికిత్స అందించేందుకు హైదరాబాద్ హైటెక్ సిటీ యశోద హాస్పిటల్స్‌లో అత్యాధునిక నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ ఎన్‌జీఎస్ సదుపాయాన్ని ప్రారంభించినట్లు మెడికల్ ఆంకాలజిస్ట్ యశోద హాస్పిటల్ హైటెక్ సిటీ డాక్టర్ లక్ష్మారెడ్డి మేకల తెలిపారు. ఖమ్మం యశోద మెడికల్ సెంటర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సంప్రదాయ చికిత్సలకు భిన్నంగా రోగి జన్యు మార్పులను గుర్తించి,వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా చికిత్స అందించేందుకు ఈ సాంకేతికత దోహదపడుతుందన్నారు. ఊపిరితిత్తులు,రొమ్ము, జీర్ణాశయ సంబంధిత క్యాన్సర్లతో పాటు ఇతర క్యాన్సర్ల చికిత్సలోనూ ఎన్‌జీఎస్ పరీక్షలు కీలకంగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఆసుపత్రిలోనే ఈ పరీక్షలు అందుబాటులో ఉండటంతో వేగంగా, కచ్చితంగా ఫలితాలు తెలుసుకొని తగిన చికిత్సను ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. లక్ష్యిత చికిత్సలు, ఇమ్యూనోథెరపీ వంటి ఆధునిక విధానాలు క్యాన్సర్ రోగుల జీవనకాలం, జీవన నాణ్యతను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. రోబోటిక్ ఆంకోసర్జరీ, అధునాతన రేడియేషన్ థెరపీతో పాటు సమగ్ర క్యాన్సర్ వైద్య సేవలను యశోద హాస్పిటల్స్ అందిస్తోందన్నారు. అత్యాధునిక సాంకేతికతతో రోగి కేంద్రిత వైద్య సేవలను మరింత విస్తరించడమే లక్ష్యమని అన్నారు. ఈ సమావేశంలో యశోద హాస్పిటల్ మేనేజర్లు బాలరాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి జన్మ దినోత్సవ వేడుకలకు ముమ్మర ఏర్పాట్లు.

- ఖమ్మం, కొత్తగూడెం, కూసుమంచిలో రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు.

ఖమ్మం అక్టోబర్ 27 మీ వార్త ప్రతినిధి:

ఖమ్మంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం రోజున ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు సన్నద్ధమయ్యారు. ఇందులో భాగంగా ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం ఉదయం 8:30 గంటలకు తలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నారు. కూసుమంచిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఉదయం 9:30 గంటలకు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అక్కడ కూడా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కూసుమంచి ప్రధాన కూడలి నుంచి బైక్ ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మంత్రి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మంత్రి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

## లైన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం విలియనీయం సేవలు అభినందనీయం.

- ధోతి బాబురావు అధ్యక్షతన భోజన వితరణ.

కొత్తగూడెం అక్టోబర్ 27 మీ వార్త ఆర్ సి:




మానవసేవయే మాధవసేవ అంటూ పుట్టిన ప్రతి మనిషి తోటి వారికి సహాయాన్ని అందించే సంకల్పంతో మనిషిని మనిషిగా ప్రేమించే మనస్తత్వంతో మానవతా విలువలు కలిగిన వారు ఉంటారని అలాంటివారు నిరంతరం ఉండాలని లైన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం మిలియని యం అధ్యక్షులు ధోతి బాబురావు అన్నారు. మంగళవారం. 27-10-2026 మధ్యాహ్నం 320జు డిస్టిక్ గవర్నర్ పిఎం జెఎఫ్, లయన్,, కె వి ప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా కొత్తగూడెంలోని హెడ్ ఆఫీస్ ఎదురుగా ఉన్న శ్రీ జ్యోతి అనాధ వృద్ధుల శరణాలయ ఆశ్రమంలో భోజనాలు ఏర్పాటు చేయడం జరిగినది. పిల్లలకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు పిల్లలు ఉన్నతులుగా ఎదగాలని ఎన్నో ఆశలు కన్నా ఆ తల్లిదండ్రుల ఆశలు అడియాశలు చేస్తూ వృద్ధాప్యంలో అండగా ఉండాల్సిన పుత్రులు తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపించడం దురదృష్టకరమని దోతి బాబురావు ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో వృద్ధాశ్రమాలు లేని ఈ సమాజాన్ని చూడాలని ఆశాభావం వ్యక్తం చేశారు, ఈ అన్న వితరణ కార్యక్రమంలో సెక్రటరీ లయన్ పగడాల నగేష్, ఆర్ సి లయన్ మండల రాజేశ్వరరావు, లయన్ డాక్టర్ జి బి మోహన్, ఎం జె ఎఫ్ లయన్ రాయల శాంతయ్య, డి సి లయన్ బొక్క శ్రీనివాస్, లయన్ శ్రావణ్ తో తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పెండింగ్ పనులు 30వ తేదీ లోపు పూర్తి చేయాలి గ్రామ సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి.

కారేపల్లి అక్టోబర్ 27 మీ వార్త ప్రతినిధి:



ఇందిరమ్మ పథకంలో భాగంగా ఇల్లు మంజూరైన లబ్ధిదారులు ఈనెల 30వ తేదీ లోపు పెండింగ్ పనులు పూర్తి చేసుకోవాలని రావోజీ తండా గ్రామ సర్పంచ్ భూక్య బాలు నాయక్ గ్రామ పంచాయతీ కార్యదర్శి కొండపల్లి అనిల్ కుమార్ లు అన్నారు. మండల పరిధిలోని రావోజీ తండ గ్రామపంచాయతీలో, ఇందిరమ్మ పథకంలో భాగంగా ఇల్లు మంజూరై, స్లాబ్ లెవెల్ వరకు పూర్తి చేసుకున్న, లబ్ధిదారుల గృహమునకు వెళ్లి, మిగిలిన పనులు, ఈనెల 30 వరకు పూర్తి చేసుకోవాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేసుకోవాలన్నారు. సకాలంలో పనులు పూర్తిచేసుకుని ఫైనల్ బిల్లు చేయించుకోవాలని కోరారు. ఎల్ నినో దృష్ట్యా రాబోయే కాలంలో రైతులు వరి, మొక్కజొన్న కు బదులు గా ప్రత్యామ్నాయ పంటలు వేయవలసిందిగా మైక్ అనౌన్స్ మెంట్ చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, గ్రామపంచాయతీ తదితరులు సిబ్బంది పాల్గొన్నారు .

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డిని గెలిపించాలి.

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.

ఖమ్మం అక్టోబర్ 27 మీ వార్త ప్రతినిధి:





ఖమ్మంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి విజయానికి పార్టీ శ్రేణులంతా ఐక్యంగా కృషి చేయాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపిలుపునిచ్చారు. ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డిని ఏఐసీసీ, పీసీసీ ఎంపిక చేయడం మంచి నిర్ణయమని పేర్కొన్నారు. ఉన్నత విద్యావంతుడిగా, రాజకీయ కుటుంబ నేపథ్యం కలిగిన వ్యక్తిగా సర్వోత్తమ రెడ్డి పట్టభద్రుల సమస్యలను అర్థం చేసుకుని పనిచేయగలరని తెలిపారు. ఖమ్మంలో తనను మెజారిటీతో గెలిపించిన విధంగానే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు, పట్టభద్ర ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి కార్యకర్త, నాయకుడు గడపగడపకు వెళ్లి అర్హులైన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించాలని అన్నారు. ఇతర జిల్లాల్లో పార్టీ శ్రేణులు పనిచేస్తున్న తీరుకు అనుగుణంగా ఖమ్మం జిల్లాలోనూ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కష్టపడాలని పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఎన్నికల సన్నాహాల్లో భాగంగా పట్టభద్రుల నమోదు నుంచి ప్రచారం వరకు ప్రతి అంశాన్ని ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లాలని మంత్రి తుమ్మల తెలిపారు.

# ధంసలాపురం చెరువులో గుర్రపుడెక్క తొలగింపునకు ప్రత్యేక యంత్రంతో చర్యలు.

- చెరువు శుభ్రపరిచే పనులను వేగవంతంగా పూర్తి చేయాలి.
- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్.

ఖమ్మం అక్టోబర్ 27 మీ వార్త ప్రతినిధి:





స్థానిక ధంసలాపురం చెరువులో విస్తరించిన గుర్రపుడెక్క మొక్కలను ప్రత్యేక యంత్రం ద్వారా తొలగింపును జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ చెరువులో నీటి ఉపరితలంపై పెద్దఎత్తున విస్తరించిన గుర్రపుడెక్క, ఇతర జలకలుపు మొక్కలను తొలగించేందుకు అక్వాటిక్ వీడ్ హార్వెస్టర్ అనే ప్రత్యేక యంత్రాన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఈ యంత్రం ద్వారా గుర్రపుడెక్క తొలగింపు ప్రక్రియ వేగవంతంగా సాగడంతో పాటు, మానవ శ్రమ కూడా తగ్గుతుందని తెలిపారు. చెరువుల్లో గుర్రపుడెక్క అధికంగా విస్తరించడం వల్ల నీటి ఉపరితలంపై సూర్యరశ్మి ప్రసరణ తగ్గుతుందని, నీటిలో ఆక్సిజన్ స్థాయులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. చెరువుల్లో గుర్రపుడెక్కను తొలగించడం ద్వారా నీటి పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు, జలవనరులను పరిశుభ్రంగా ఉంచేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అధికారులు పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, గుర్రపుడెక్క తొలగింపు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ పర్యటన సందర్భంగా మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఏ. మల్లేశం, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయచందర్, మున్సిపల్ కార్పొరేషన్ డీఈ నవ్యజ్యోతి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత. అప్రమత్తంగా ఉందాం సైబర్ నేరాలను అరికడదాం.

సత్తుపల్లి అక్టోబర్ 27 మీ వార్త టౌన్ రిపోర్టర్:



సత్తుపల్లి సైబర్ నేరాల పట్ల విద్యార్థులు, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గంగారం 15వ పోలీసు బెటాలియన్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. సైబర్ నేరాల నివారణలో పౌరుల పాత్ర' అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీలో విద్యార్థులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ప్రతిరోజూ వినియోగించే మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్, ఆన్‌లైన్ బ్యాంకింగ్, సోషల్ మీడియా విషయంలో అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులు పేర్కొన్నారు. ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీ మోసాలు, హ్యాకింగ్, వ్యక్తిగత సమాచార చోరీ, సైబర్ వేధింపుల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించాలని అభిప్రాయపడ్డారు.

**సైబర్ నేరాల నివారణ పౌరులందరి బాధ్యత అని తెలిపారు.**

విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఓటీపీలు, ఏటీఎం పిన్‌లు, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని విద్యార్థులకు సూచించారు. తెలియని లింకులపై క్లిక్ చేయడం, నమ్మకం లేని వ్యక్తులు పంపే ఫైళ్లను డౌన్‌లోడ్ చేయడం ప్రమాదకరమన్నారు. వ్యక్తిగత ఫొటోలు, చిరునామాలు, పాస్‌వర్డ్‌లు, ఇతర కీలక సమాచారాన్ని సోషల్ మీడియాలో బహిరంగంగా పంచుకోరాదని తెలిపారు. ఆన్‌లైన్ మోసంలో డబ్బు పోగొట్టుకుంటే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో ఎవరైనా బెదిరించినా, వేధించినా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు తెలియజేయాలని చెప్పారు. విద్యార్థులు, తల్లిదండ్రులు సైబర్ భద్రతపై అవగాహన పెంచుకోవాలని, సాంకేతికతను విద్య, విజ్ఞానం, సత్కార్యాల కోసం ఉపయోగించుకోవాలని హితవు పలికారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పోలీసులు తెలిపారు. సైబర్ నేరాలకు పాల్పడేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో 15వ బెటాలియన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి.

- నీటి తొట్లు, పశుగ్రాస పెంపకం, పశువుల షెడ్ల నిర్మాణానికి అవకాశం.
- పాడి రైతులకు,పశు పోషకులకు ప్రభుత్వ ప్రోత్సాహకం వరం.
- పశువులకు బీమా సౌకర్యం.
- కామేపల్లి మండల పశువైద్యాధికారి డాక్టర్ జి.నాగులు.

కామేపల్లి అక్టోబర్ 27 మీ వార్త ప్రతినిధి:





ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో తలెత్తే నీటి ఎద్దడి, పశుగ్రాస కొరతను ఎదుర్కొనేందుకు పాడి రైతులు, మేకలు, గొర్రెల పెంపకందారులకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కామేపల్లి మండల పశు వైద్య అధికారి డాక్టర్ జి.నాగులు మంగళవారం కోరారు. వీబీజీ రాంజీ పథకం ద్వారా గ్రామాల్లో పశువులకు నీటి తొట్ల నిర్మాణం, పశుగ్రాస పెంపకం, పశువుల షెడ్ల నిర్మాణం వంటి పనులకు నిబంధనల మేరకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. వాటిని వినియోగించుకోవడం ద్వారా వేసవిలో పశువులకు నీరు, పశుగ్రాసం కొరతను తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. అదే విధంగా, నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ (ఎన్ ఎల్ ఎం) కింద పశువుల బీమా పథకం పై రైతులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సంబంధిత పథకం నిబంధనలు, అర్హతలకు లోబడి ఆవులకు రూ.30, 000, గేదెలకు రూ.40,000 వరకు బీమా సౌకర్యాన్ని రూ.133, రూ.177 ప్రీమియంతో పొందవచ్చని తెలిపారు. బీమా ప్రీమియం, బీమా మొత్తం, అర్హతలు సంబంధిత పథకం మార్గదర్శకాలకు అనుగుణంగా ఉంటాయని వివరించారు. కామేపల్లి మండలం లోని పాడి రైతులు, పశుపోషకులు, మేకలు, గొర్రెల పెంపకందారులు ఈ అవకాశాలపై తమ గ్రామం లోని సంబంధిత అధికారులను సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని డాక్టర్ నాగులు కోరారు. గ్రామ ప్రజాప్రతినిధులు కూడా ఈ పథకాల గురించి ప్రజలకు తెలియజేసి, అర్హులైన రైతులు వాటిని సద్వినియోగం చేసుకునేలా సహకరించాలని డాక్టర్ నాగులు ఈ సందర్భంగా కోరారు.

# సుశీ క్యాంప్ కార్మికుల బోనస్ సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు.

- బోనస్ కోసం విధులు బహిష్కరించి కార్మికుల నిరసన -- మేనేజ్‌మెంట్‌తో చర్చించి సమస్య పరిష్కారం.

**సత్తుపల్లి అక్టోబర్ 27 మీ వార్త ఆర్ సి: సత్తుపల్లి :**

దసరా పండుగ సందర్భంగా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున బోనస్ చెల్లించాలని స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌తో పాటు కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలందరూ కలిసి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తికి స్పందించిన ప్రభుత్వం ప్రతి కాంట్రాక్ట్ కార్మికుడికి రూ.5,500 బోనస్ చెల్లిస్తామని ప్రకటించింది.అయితే, సత్తుపల్లిలోని సింగరేణి సుశీ క్యాంపులో పనిచేస్తున్న సుమారు 2,000 మంది కాంట్రాక్ట్ కార్మికుల బ్యాంకు ఖాతాల్లో బోనస్ నగదు జమ కాకపోవడంతో కార్మికులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. బోనస్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈరోజు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు.

ఎమ్మెల్యే సూచన, జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు కార్మికుల వద్దకు చేరుకున్న కోటేశ్వరరావు.

సుశీ క్యాంప్ కార్మికుల నిరసన విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ సూచన మేరకు, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ డా. జనక్ ప్రసాద్ ఆదేశాలనుసారం సత్తుపల్లి ఏరియా ఐఎన్‌టీయూసీ వైస్



ప్రెసిడెంట్ కోటేశ్వరరావు, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సముద్రాల సుధాకర్‌తో కలిసి సుశీ క్యాంపుకు చేరుకున్నారు. సింగరేణి సంస్థ ఉత్పత్తికి ఆటంకం కలగకుండా, కార్మికులకు న్యాయం జరిగేలా సమస్యను పరిష్కరించాలనే ఉద్దేశంతో అక్కడి మేనేజ్‌మెంట్‌తో చర్చలు జరిపారు. కార్మికులకు రావాల్సిన బోనస్ చెల్లింపు సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్నారు. కోటేశ్వరరావు, సముద్రాల సుధాకర్ కృషితో బోనస్ సమస్య పరిష్కారం కావడంతో కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం కార్మికులు తిరిగి తమ విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా తమ సమస్య పరిష్కారానికి సహకరించిన స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, కార్మిక నేత డా. జనక్ ప్రసాద్, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సముద్రాల సుధాకర్‌లకు కార్మికులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**కార్మికులకు అండగా ఉంటాం -- కోటేశ్వరరావు.**



ఈ సందర్భంగా కోటేశ్వరరావు కార్మికులతో మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అండదండలతో పాటు కార్మిక నేత డా. జనక్ ప్రసాద్ కృషి, మార్గదర్శకత్వం కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎంతో తోడ్పడుతున్నాయని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ఎల్లప్పుడూ సహకరిస్తారని పేర్కొన్నారు.కార్మికులకు ఎలాంటి సమస్య ఎదురైనా, ఏ సమయంలోనైనా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు, వారి న్యాయమైన సమస్యల పరిష్కారానికి ఐఎన్‌టీయూసీ ఎల్లప్పుడూ ముందుంటుందని భరోసా ఇచ్చారు. సింగరేణి సంస్థ అభివృద్ధికి, ఉత్పత్తి పురోగతికి సహకరిస్తూనే కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ఐఎన్‌టీయూసీ నిరంతరం కృషి చేస్తుందని కోటేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నరసింహారావు, సుశి మేనేజ్మెంట్ వారు పాల్గొన్నారు.

# ఆర్నబ్ తుఫాను నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి.

- అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు భద్రాద్రి కొత్తగూడెం సర్కిల్, భద్రాచలం డివిజన్‌లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు.

**భద్రాచలం అక్టోబర్ 27 మీ వార్త:**

ఆర్నబ్ తుఫాను ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కలగకుండా, అత్యవసర పరిస్థితులను తక్షణమే ఎదుర్కొనేందుకు ం+చీఙజా ఆధ్వర్యంలో భద్రాచలం డివిజన్‌లో అన్ని ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు డివిజనల్ ఇంజనీర్ (ఆపరేషన్స్), భద్రాచలం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాను నిరంతరం పర్యవేక్షించేందుకు భద్రాచలం డివిజన్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడంతో పాటు, భద్రాద్రి కొత్తగూడెం సర్కిల్ స్థాయిలో కూడా కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. విద్యుత్ లైన్లకు సంబంధించిన సమస్యలు, ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాలపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఫిర్యాదులు అందిన వెంటనే క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు.

**కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు:**

భద్రాచలం డివిజన్ కంట్రోల్ రూమ్:
8712486025

భద్రాద్రి కొత్తగూడెం సర్కిల్ కంట్రోల్ రూమ్:
8712485821

విద్యుత్ వినియోగదారులు, రైతులు, వ్యాపారులు, పారిశ్రామిక సంస్థలు మరియు ప్రజలందరూ తుఫాను నేపథ్యంలో కింది జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని డివిజనల్ ఇంజనీర్ సూచించారు.

1. విద్యుత్ తీగలు తెగిపడితే తాకవద్దు: ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడినా, వేలాడుతున్నా వాటికి దూరంగా ఉండాలి. ఇతరులు కూడా వాటి వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
2. పొలాల్లోకి వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి: రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళ్లేటప్పుడు విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల పరిస్థితిని గమనించాలి. తెగిపడిన తీగలు లేదా దెబ్బతిన్న విద్యుత్ పరికరాల వద్దకు వెళ్లకూడదు.
3. చెట్లు లేదా కొమ్మలు విద్యుత్ లైన్లపై పడితే: స్వయంగా తొలగించే ప్రయత్నం చేయకూడదు. వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం అందించాలి.
4. దెబ్బతిన్న స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లను గమనిస్తే: వెంటనే డివిజన్ కంట్రోల్ రూమ్‌కు, సంబంధిత సెక్షన్ అధికారికి లేదా అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్‌కు తెలియజేయాలి.
5. విద్యుత్ పరికరాలను తాకవద్దు: నీటిలో మునిగిన విద్యుత్ పరికరాలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు లేదా ఇతర విద్యుత్ సామగ్రిని తాకరాదు. విద్యుత్ ప్రమాదం జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండాలి.
6. విద్యుత్ సమస్యలను వెంటనే తెలియజేయాలి: విద్యుత్ సరఫరాలో అంతరాయం, లైన్లు తెగిపడటం, స్తంభాలు విరిగిపడటం, చెట్లు లైన్లపై పడటం లేదా ఇతర నష్టాలు సంభవించినప్పుడు వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలి. విద్యుత్ సిబ్బంది అనుమతి ఇచ్చే వరకు ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకూడదు.

ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, తుఫాను సమయంలో విద్యుత్ సరఫరాను పర్యవేక్షించేందుకు శాఖ సిబ్బంది సిద్ధంగా ఉన్నారని డివిజనల్ ఇంజనీర్ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, విద్యుత్ ప్రమాదాలకు దూరంగా ఉంటూ, ఏదైనా సమస్యను గుర్తించిన వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం అందించాలని కోరారు.

# డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి.

- పట్టభద్రుల ఓటు నమోదుపై శ్రీ గణేష్ ఆటో యూనియన్ సమావేశం.

**చర్ల అక్టోబర్ 27 మీ వార్త ప్రతినిధి:**

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించే ప్రతినిధులను ఎన్నుకోవడంలో ప్రతి ఓటు కీలకమని, డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు.

చర్ల బస్టాండ్ ఆవరణలో శ్రీ గణేష్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఓటు నమోదు ప్రాధాన్యతపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి శ్రీ గణేష్ ఆటో ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పామర్రు బాలాజీ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం చర్ల మండల కార్యదర్శి మచ్చా



రామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో విలువైనదని పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు నమోదు ప్రక్రియపై యువతతో పాటు డిగ్రీ పూర్తి చేసిన వారందరూ అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. పట్టభద్రుల సమస్యలు, ఉద్యోగ అవకాశాలు, విద్యారంగ సమస్యలు తదితర అంశాలను శాసనమండలిలో ప్రస్తావించే ప్రతినిధులను ఎన్నుకోవడంలో పట్టభద్రుల ఓటు కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటు నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో శ్రీ గణేష్ ఆటో ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పామర్రు బాలాజీ, యూనియన్ కార్యదర్శి దొంతు ప్రసాద్, కోడిరెక్కల నాగరాజు, బొంతు శివ, బొంతు బన్నీ, గురునాథం, పొగాకు నర్సింహా, నాగముత్యం తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల డబ్బుల వసూళ్లపై విచారణ జరిపించాలి.

- అమ్మగూడెం మాజీ సర్పంచ్ గండు జానయ్య డిమాండ్.

**నేలకొండపల్లి అక్టోబర్ 27 మీ వార్త ఆర్ సి:**

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేశారంటూ వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించి, వాస్తవాలు నిగ్గుతేల్చాలని అమ్మగూడెం మాజీ సర్పంచ్ గండు జానయ్య ప్రభుత్వ అధికారులను కోరారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయంటూ తనపై తప్పుడు ప్రచారం చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు. మంగళవారం నేలకొండపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జానయ్య మాట్లాడారు.

నేలకొండపల్లి మండలంలోని అమ్మగూడెం గ్రామానికి మొదటి విడతలో 11 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, వాటిలో ఎనిమిది మంది లబ్ధిదారులను తన ఆధ్వర్యంలో స్వయంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. మిగిలిన ముగ్గురు లబ్ధిదారులను ఇతర నాయకులు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. తాను ఎంపిక చేసిన లబ్ధిదారుల నుంచి ఎవరైనా డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు ఉంటే విచారణ జరిపించాలని కోరారు. తాను ఎలాంటి డబ్బులు



ఆశించలేదని,ఒక్క రూపాయి కూడా తీసుకోలేదని స్పష్టం చేశారు. గత 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి నిస్వార్థంగా సేవలందిస్తున్న తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రచారం చేయడం బాధాకరమన్నారు. పార్టీలో తన ఎదుగుదలను చూసి ఓర్వలేక కొందరు తనపై అసత్య ప్రచారానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. తనపై ఆరోపణలు చేస్తున్న వారు వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని సూచించారు.

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల విషయంలో ఎలాంటి అనుమానాలు ఉన్నా పారదర్శకంగా విచారణ జరిపించాలని జానయ్య డిమాండ్ చేశారు.ముఖ్యంగా ఇతర నాయకుల ద్వారా ఎంపికైన లబ్ధిదారుల విషయంలోనూ సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు.విచారణలో తాను అవినీతికి పాల్పడినట్లు తేలితే సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవచ్చని అన్నారు.పార్టీ తీసుకునే నిర్ణయాలకు తాను కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు.

తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించే ప్రచారాన్ని మానుకోవాలని హెచ్చరించారు. ఇలాంటి ప్రచారం కొనసాగితే న్యాయపరమైన చర్యలు తీసుకుంటానని గండు జానయ్య తెలిపారు.

## ఈ వ్యర్థాలను వేరు చేద్దాం పర్యావరణ రక్షిద్దాం.

- మోడ్రన్ ఇఖ్రా స్కూల్ కరస్పాండెంట్. అబ్దుల్ బాసిత్.




**కొత్తగూడెం అక్టోబర్ 27 మీ వార్త ఆర్ సి:**

విద్యార్థులకు మరియు మన చుట్టూ పక్కల ఉన్న వారికి ఈ వ్యర్థాల వల్ల పర్యావరణానికి జరుగుతున్న నష్టాలను వివరిస్తూ, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దేశవ్యాప్త ఉద్యమం లో భాగంగా ఈ రోజు కొత్తగూడెం కార్పొరేషన్ పన్నెండవ వార్డు సుభాష్ చంద్రబోస్ నగర్, రామవరం లోని మోడ్రన్ ఇఖ్రా పాఠశాలలో అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు ఈ వ్యర్థాల నష్టాల పోస్టర్, పెయింటింగ్, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు ఈ వ్యవర్థాల వలన భవిష్యత్తులో భూమి మీద ఉన్న ప్రాణికోటికి జరుగబోయే నష్టాలను వివరించారు.

ముఖ్యంగా అనవసరంగా వచ్చిన ప్రతి కొత్త మోడళ్లు కోవడం వల్ల పాత ఈ వ్యర్థాలు పెరిగిపోయాయని, పాడైన వాటిని తిరిగి ఉపయోగించే ప్రయత్నం చేయాలని కోరారు. ఈ వ్యర్థాలు భూమి లో వేల సంవత్సరాల వరకు అలాగే ఉండిపోయి భూమి,నీరు, గాలిని కలుషితం చేస్తాయని అన్నారు. రాబోయే తరాలకు మనం అందించే ఆస్తి కలుషితం లేని గాలి పచ్చని చెట్లు, మాత్రమే అని అన్నారు. ఈ సందర్భంగా స్కూల్ పరిసరాల్లో ర్యాలీ నిర్వహించి చుట్టూ పక్కల వారికి పర్యావరణ పరిరక్షణ మీద అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అధ్యాపకురాలు పర్వీన్ సుల్తానా, టీచర్లు ప్రసన్న, నాజీయా, సరస్వతీ, నుసరత్, సల్మా జాఫర్, ఖాజా విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## వన్యప్రాణుల వేటగాళ్లు అరెస్టు నలుగురిపై కేసు నమోదు.

**కారేపల్లి అక్టోబర్ 27 మీ వార్త ప్రతినిధి:**





వన్యప్రాణుల వేట కోసం అక్రమంగావిద్యుత్ తీగలు ఏర్పాటు చేసిన నలుగురిపై కారేపల్లి రేంజ్ అటవీశాఖ అధికారులు కేసు నమోదు చేశారు. నిందితులను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్కు తరలించినట్లు ఎస్ఆర్డీ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 24న రాత్రి 7:30 గంటల సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో విద్యుత్ శాఖసిబ్బంది సహకారంతో అటవీ అధికారులు తనిఖీలు చేపట్టారు. బీట్ ఆఫీసర్ రవికుమార్ పరిధిలోని అప్పాయిగూడెం సమీపంలో పాలిక కోటయ్యకు చెందిన పామాయిల్ తోటలో వన్యప్రాణుల వేట కోసం ఏర్పాటు చేసిన అక్రమ విద్యుత్ తీగలను గుర్తించారు.ఈ ఘటనలో బాధ్యులుగా గుర్తించిన పబ్బుల రాములు, భూక్యా రఘు, రెడ్డిబోయిన వెంకన్న, ఎల్లిబోయిన నాగేశ్వరరావు పై కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. నిందితులు మాదారం, పరిసర గ్రామాలకు చెందిన వారని తెలిపారు. అక్రమ విద్యుత్ ఉచ్చులు వన్యప్రాణుల ప్రాణాలకే కాకుండా తనిఖీలకు వెళ్లే అటవీశాఖ సిబ్బందికి సైతం ప్రాణాపాయంగా మారే ప్రమాదం ఉందని ఆర్. శ్రీనివాసరావు హెచ్చరించారు. వన్యప్రాణుల వేటకు విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధమని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## అర్హులైన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేపిస్తాం.

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీని గెలిపిస్తాం.
- బిఆర్ఎస్ నాయకులు ధరావత్ రాందాస్.

**కామేపల్లి అక్టోబర్ 27 మీ వార్త ప్రతినిధి:**



రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేపించి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తామని కామేపల్లి మండలం బర్లగూడెం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు ధరావత్ రాందాస్ మంగళవారం స్పష్టం చేశారు. తెలంగాణ తొలి సీఎం కెసిఆర్ హాయంలో జరిగిన అభివృద్ధి,సంక్షేమమే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపుకు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ఇప్పటి నుండే సైనికులా పని చేయాలని పార్టీ శ్రేణులకు ఈ సందర్భంగా రాందాస్ నాయక్ పిలుపునిచ్చారు.

## ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా నీటిని, విద్యుత్ ను పొదుపుగా వాడుకోవాలి.

- రుక్కి తండా సర్పంచ్ గుగులోత్ రమాదేవి.
- వర్షాభావ పరిస్థితులపై ప్రజలు, రైతులు అవగాహన కలిగి ఉండాలి.
- పంచాయతీ కార్యదర్శి ఎండి ఫజల్.

**కామేపల్లి అక్టోబర్ 27 మీ వార్త ప్రతినిధి:**



ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా నీటిని,విద్యుత్ ను రైతులు, ప్రజలు పొదుపుగా వాడుకోవాలని కామేపల్లి మండలం రుక్కి తండా పంచాయతీ సర్పంచ్ గుగులోత్ రమాదేవి కోరారు.మంగళవారం రుక్కి తండా గ్రామంలో ఎల్ నినో ప్రభావ పరిస్థితులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సర్పంచ్ రమాదేవి ప్రసంగించారు. వర్షాభావ పరిస్థితులపై రైతులు,ప్రజలు అవగాహన కలిగి ఉండాలని కోరారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని అన్నారు.వరి, మొక్కజొన్న పంటలను రబిలో ఎంత మాత్రము సాగు చేయవద్దని కోరారు.ఎల్ నినో ప్రభావం కారణంగా వాతావరణంలో సంభవించే మార్పులు, ఎండ తీవ్రత, తక్కువ వర్షపాతం వంటి పరిస్థి తులపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది.ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణ, మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నట్టు తెలిపారు. తమ కృషికి ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమం లో ఇరిగేషన్ కు చెందిన శ్రీనివాసరావు, ట్రాన్స్ కో లైన్ మెన్ మధు,వార్డు సభ్యులు,గ్రామస్థాయి అధికారులు, గ్రామస్థులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మద్దులపల్లి లో వీబీజీ రాంజీ పనులు పరిశీలించిన ఈసీ దామాల వెంకటేశ్వర్లు



**కామేపల్లి, అక్టోబర్ 27 మీ వార్త ప్రతినిధి :**

కామేపల్లి మండలం మద్దులపల్లి గ్రామంలో వీబీజీ రాంజీ పథకం కింద నిర్వహిస్తున్న పనులను ఈసీ దామాల వెంకటేశ్వర్లు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.కూలీలు నిర్వహిస్తున్న కందకాల తీత పనులను పరిశీలించారు.కూలీల భాగస్వామ్యం, చేసిన పని, ప్రగతికి సంబంధించిన అంశాలను పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా కూలీలు వీబీజీ రామ్ జీ పథకం ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ నిబంధనల మేరకు చేతినిండా పని కల్పించి తద్వారా కడుపునిండా అన్నం పెట్టి ఆదుకోవడం జరుగుతుందన్నారు. పేదరిక నిర్మూలనకు, వలసల నియంత్రణకు, కూలీలకు ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా ఈసీ దామాల వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ పడిగ ముత్తిలింగం, మేట్ రాంబాబు, ఉపాధి కూలీలు, ముఠామేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

## అర్నబ్ తుఫాను నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

- పరిస్థితులకు అనుగుణంగా పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించాలి.
- అర్నబ్ తుఫాన్ నేపథ్యంలో పత్రిక ప్రకటన విడుదల చేసిన జిల్లా కలెక్టర్.

**ఖమ్మం, అక్టోబర్ -27,మీ వార్త ప్రతినిధి.**



అర్నబ్ తుఫాను నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిస్థితులకు అనుగుణంగా పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.స్థానిక వాతావరణ పరిస్థితులను ఎప్పటి కప్పుడు పరిశీలించాలని, భారీ వర్షాలు కురిసిన సందర్భాల్లో సంబంధిత మండల విద్యాశాఖ అధికారులు పాఠశాలలకు, సంబంధిత శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారులు సీడీపీఓలు అంగన్వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించాలని కలెక్టర్ ఆదేశించారు.తుఫాను నేపథ్యంలో జిల్లా అధికారులు, ఇతర సిబ్బందికి మంజూరు చేసిన సెలవులను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి ఒక్కరూ విధులకు హాజరై, తమ హెడ్క్వార్టర్లలోనే అందుబాటులో ఉండాలని, అనుమతి లేకుండా హెడ్క్వార్టర్ను విడిచి వెళ్లరాదని ఆదేశించారు.తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా తక్షణ చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.విద్యుత్ అంతరాయాలపై తక్షణ చర్యలు తీసుకోవాలి.భారీ వర్షాలు, బలమైన గాలుల కారణంగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగే అవకాశం ఉందని, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉంటూ, అంతరాయం ఏర్పడిన ప్రాంతాల్లో పరిస్థితులను సమీక్షించి, సాధ్యమైనంత త్వరగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ప్రజలు విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని సూచించారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో భారీ వృక్షాలు, చెట్లుకూలిపోయే ప్రమాదం ఉందని, ప్రజలు చెట్ల కింద నిలబడరాదని కలెక్టర్ సూచించారు. పాతబడిన గోడలు, శిథిలావస్థలో ఉన్న భవనాల సమీపంలో ఉండకూడదని, అత్యవసర పరిస్థితుల్లో అధికారులు సూచించిన జాగ్రత్తలను పాటించాలని తెలిపారు.తుఫాను ప్రభావం తగ్గే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు అవసరమైన సహాయ చర్యలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## బర్లగూడెం - గరిడేపల్లి రహదారికి ఇరువైపులా ముళ్ళ చెట్లు, పిచ్చి మొక్కలు తొలగింపు - సర్పంచ్ మాలోత్ కిషన్



**కామేపల్లి, అక్టోబర్ 27 మీ వార్త ప్రతినిధి:**

కామేపల్లి మండలం బర్లగూడెం పంచాయతీ లో రహదారులకు ఇరువైపులా పెరిగివున్న ముళ్ళ చెట్లు, పిచ్చి మొక్కలను డోజర్ సహాయంతో తొలగించి శుభ్రపరచినట్లు సర్పంచ్ మాలోత్ కిషన్ మంగళవారం తెలిపారు. అదేవిధంగా బర్లగూడెం - గరిడేపల్లి ప్రధాన రహదారి ఇరువైపులా కూడా దట్టంగా పెరిగి ఉండి వాహనాల రాకపోకలకు, ప్రయాణికులకు అంతరాయం కలిగిస్తున్న పిచ్చి చెట్లను, ముళ్ళ పొదలను కూడా తొలగించి శుభ్రం చేయడం జరిగిందని సర్పంచ్ కిషన్ తెలిపారు. పంచాయితీలో పరిశుభ్రత, పచ్చదనం, రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.తమ కృషికి ప్రతి ఒక్కరు సహకరించాల ని కోరారు. అందరి సహకారం కృషి వల్లనే లక్ష్యం సిద్ధిస్తుందన్నారు.

# విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

- రూ.80 వేల విలువైన బ్యాగుల అందజేత

**నేలకొండపల్లి,అక్టోబర్ 27 మీ వార్త ఆర్ సి:**

నేలకొండపల్లి మండల పరిధిలోని రాజేశ్వరపురం ఉన్నత పాఠశాలలో చదువుతున్న 150 మంది విద్యార్థులకు వసుదైక కుటుంబం, కోస్టా ఫైనాన్షియల్ సర్వీస్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో రూ.80 వేల విలువైన స్కూల్ బ్యాగులను మంగళవారం పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.చొక్కారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి పీఎంవో ప్రవీణ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని, విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు రూ.80 వేల విలువైన స్కూల్ బ్యాగులను అందించడం స్వచ్ఛంద సంస్థల సేవా దృక్పథానికి నిదర్శనమన్నారు. సదరు సంస్థలు ఇప్పటికే





రాష్ట్రవ్యాప్తంగా నిరుపేద విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, ఇతర విద్యా సామగ్రిని పంపిణీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు,స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందించాలని ఆయన కోరారు.ఇలాంటి సేవా కార్యక్రమాలు ప్రభుత్వ విద్యావ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి దోహదపడతాయని తెలిపారు. అనంతరం భవిత కేంద్రానికి సుదీర్ఘకాలంగా సేవలందించిన ఐఈఆర్పీ సాంబశివరావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వసుదైక కుటుంబం, కోస్టా స్వచ్ఛంద సంస్థల నిర్వాహక సభ్యుడు సాంబశివరావు, సర్పంచ్ దండా రంగయ్య,మండల విద్యాశాఖ అధికారి చలపతిరావు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు చొక్కారావు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు.. వేసంగి వరి సాగుకు నీరు ఇవ్వొద్దు.

- తాగునీటి అవసరాలకు మాత్రమే తాలిపేరు ప్రాజెక్టు నీటిని వినియోగించాలి: ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు.

**భద్రాచలం అక్టోబర్ 27 మన మీ వార్త:**

మంగళవారం భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు గారి క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ మరియు అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ సంవత్సరం ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా, తాలిపేరు ఆయకట్టు పరిధిలో ఎట్టి పరిస్థితుల్లోనూ వేసంగి వరి పంట సాగు చేయడం కుదరదని సూచించారు. తాలిపేరు ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించుకోవాలని, కరువు పరిస్థితుల నేపథ్యంలో నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. కరువు పరిస్థితుల దృష్ట్యా పశువులను కాపాడుకోవడం కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. రైతులు తమ అవసరాలకు అనుగుణంగా పశుగ్రాసం, సజ్జలు, జనుములు తదితర





ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు తగిన సూచనలు చేయాలని కోరారు. ఇరిగేషన్ డిపార్ట్మెంట్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వం సూచించిన విధంగా ఎట్టి పరిస్థితుల్లోనూ వేసంగి వరి పంటకు నీటిని విడుదల చేయకుండా, తాగునీటి అవసరాలకు మాత్రమే నీటిని వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే వ్యవసాయ శాఖ అధికారులు వేసంగి వరి సాగుకు సంబంధించిన విత్తనాలను ప్రభుత్వ తరఫున సరఫరా చేయకుండా చూడాలని, ప్రైవేటు విత్తన కంపెనీలు కూడా ఈ సంవత్సరం వేసంగి వరి విత్తనాలను సరఫరా చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని, నీటి లభ్యతను బట్టి వ్యవసాయ ప్రణాళికలు రూపొందించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

# వాట్సాప్ గ్రూపుల్లో తప్పుడు ప్రచారాలు చేయొద్దు.

- చట్టవిరుద్ధమైన పోస్టులు పెడితే, ప్రోత్సహిస్తే అడ్మిన్లపైనా చట్టపరమైన చర్యలు: భద్రాచలం డీఎస్పీ ఎం. అరుణ్ కుమార్.

**భద్రాచలం అక్టోబర్ 27 మన మీ వార్త:**

భద్రాచలం పట్టణంలోని వాట్సాప్ గ్రూపుల్లో తప్పుడు సమాచారం, నిరాధార ఆరోపణలు, అసభ్యకరమైన వ్యాఖ్యలు, వ్యక్తిగత దూషణలు చేసే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని భద్రాచలం డీఎస్పీ ఎం. అరుణ్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం భద్రాచలం డీఎస్పీ కార్యాలయంలో పట్టణంలోని వివిధ వాట్సాప్ గ్రూపుల అడ్మిన్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. వాస్తవాలను నిర్ధారించుకోకుండా తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం, ఇతరుల వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించేలా పోస్టులు పెట్టడం, ప్రజల్లో అనవసర భయాందోళనలు లేదా వివాదాలు సృష్టించే చర్యలకు దూరంగా ఉండాలన్నారు. వాట్సాప్ గ్రూపుల అడ్మిన్లు తమ గ్రూపుల్లో జరుగుతున్న కార్యకలాపాలను పర్యవేక్షించాలని, అభ్యంతరకరమైన లేదా






చట్టవిరుద్ధమైన పోస్టులు గుర్తించినప్పుడు వాటిని తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పదేపదే నిబంధనలను ఉల్లంఘించే వ్యక్తుల విషయంలో గ్రూపు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. చట్టవిరుద్ధమైన ప్రచారంలో అడ్మిన్ల ప్రమేయం లేదా వర్తించే చట్టం ప్రకారం బాధ్యత ఉన్నట్లు ఆధారాలతో తేలితే వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజలకు ఉపయోగపడే సమాచారం, ప్రభుత్వ సూచనలు, సామాజిక అవగాహన కల్పించే అంశాలను పంచుకునేందుకు వాట్సాప్ గ్రూపులను వినియోగించాలని డీఎస్పీ కోరారు. ఏదైనా సమాచారం అనుమానాస్పదంగా ఉన్నప్పుడు దానిని ఇతరులకు పంపించే ముందు వాస్తవాలను నిర్ధారించుకోవాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో భద్రాచలం టౌన్ సీఐ ఎస్. రాజు, టౌన్ ఎస్ఐ సతీష్, ట్రాఫిక్ ఎస్ఐ కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ 'ఓటు చోరీ' ప్రచారం బూటకం!

- ప్రజల్లో భయాందోళనలు సృష్టించి ఎన్నికల సంఘం విశ్వసనీయతను దెబ్బతీయొద్దు
- డీప్ స్టేట్ కుట్రలు భారతదేశంలో సాగవు.
- బీజేపీ రాష్ట్ర నాయకులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి.

**నేలకొండపల్లి అక్టోబర్: 27 మీ వార్త ఆర్ సి**

నేలకొండపల్లి పాలేరు అసెంబ్లీని యోజకవర్గం: ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ) ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న 'ఓటు చోరీ' ప్రచారం రాజకీయ ప్రయోజనాల కోసం సాగిస్తున్న బూటకపు ప్రచారమని బీజేపీ రాష్ట్ర నాయకులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు.ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియపై ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టించడం,ఎన్నికల సంఘం విశ్వసనీయతను దెబ్బతీయడం కాంగ్రెస్‌కు తగదని హితవు పలికారు.

ఎస్ఐఆర్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా నిర్వహించబడుతోందని,అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం జరగడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలపై ఎవరికైనా అభ్యంతరాలుంటే నిరాధార ఆరోపణలు చేయకుండా,తగిన ఆధారాలతో సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించకుండా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం సాధిస్తున్న అభివృద్ధిని, సుపరిపాలనను కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతోందని శ్రీధర్ రెడ్డి ఆరోపించారు. అందుకే రాజ్యాంగబద్ధ సంస్థలపై ప్రజలకు అపనమ్మకం కలిగించేలా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలపై అనుమానాలు రేకెత్తించడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని మండిపడ్డారు.





**డీప్ స్టేట్ కుట్రలు సాగనివ్వం**

కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు 'డీప్ స్టేట్' సిద్ధాంతం పేరుతో ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తే భారతదేశంలో అలాంటి కుట్రలు ఫలించవని శ్రీధర్ రెడ్డి హెచ్చరించారు.దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం ఉందని,ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొడతారని ధీమా వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో రాజకీయ దుష్ప్రచారం చేయడం మానుకొని,వాస్తవాల ఆధారంగా మాట్లాడాలని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కు పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని,ఓటర్ల జాబితాల సవరణపై పారదర్శకతను ప్రశ్నించే వారు నిర్దిష్టమైన ఆధారాలతో ముందుకు రావాలని ఆయన పేర్కొన్నారు. రాజకీయ ఆరోపణల కంటే ప్రజలకు వాస్తవాలను వివరించడం ముఖ్యమని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ యువమోర్చా జిల్లా నాయకులు అనంత ఉపేందర్ గౌడ్,మండల అధ్యక్షుడు పాగతి సుధాకర్,కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చావా కిరణ్,మండల సీనియర్ నాయకులు మన్నే కృష్ణారావు, దివాకర్ శర్మ,మండల ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ, గోవిందరావు, కందనబోయిన గోపి, మొయినుద్దీన్, సూరేపల్లి జ్ఞానరత్నం తదితరులు పాల్గొన్నారు.

# అరువై ఏళ్ల నాటి ఆంధ్ర పాలకులే నయం బెల్ట్ షాపులను ఏనాడు అనుమతించలేదు

- పన్నెండుమంది మంది బిడ్డల అమరత్వం బెల్ట్ షాపుల కోసమేనా
- యువతరం జీవితాలను నాశనం చేసి బెల్ట్ షాపులను వెంటనేమూసివేయాలి-తాండ్ర వెంకటేశ్వర్లు

**కొత్తగూడెం అక్టోబర్ 27 మీ వార్త ఆర్ సి**

బహుజన సమాజ్ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ ఇన్చార్జ్ తాండ్ర వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బెల్ట్ షాపులను వెంటనే మూసివేయాలని కొత్తగూడెం ఎక్సైజ్ సీఐ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది,

గుడి బడి రాత్రి పగలు అని తేడా లేకుండా అక్రమంగా ఏర్పాటు చేస్తున్న బెల్ట్ షాప్ ల వల్ల చుట్టుపక్కల కుటుంబాలు మహిళలు పిల్లలు అనేక ఇబ్బందులు పడుతున్నారు, తెల్లవారుజామున ఒంటిగంట నుండి రాత్రి 12 గంటల వరకు అదేచంగా బెల్టు షాపులు నడపడం దురదృష్టకరం ఒకప్పుడు మద్యం 50 సంవత్సరాలు దాటిన వృద్ధులు మాత్రమే సేవించేవారు, నేడు వయసుతో పని లేకుండా 12 సంవత్సరాల పిల్లలు మొదలు యువత జీవితం నాశనం అవుతుందంటే ఈ




పాపం తెలంగాణ ప్రభుత్వందే ఈ మధ్య కాలంలో యువతలో జరుగుతున్న అనేక పరిణామాలు దృష్టిలో ఉంచుకొని చాలా చోట్ల దాడులు చేసుకోవడంలో బెల్ట్ షాపులు కేంద్రంగా జరుగుతున్నాయి,

అనేక రకాల అసాంఘిక కార్యక్రమాలకు కేంద్రాలుగా మారుతున్న బెల్ట్ షాపులను పెంచి పోషిస్తున్న ప్రభుత్వాన్ని బహుజన సమాజ్ పార్టీగా డిమాండ్ చేస్తున్నాము, ఉద్యోగాలు దొరకని యువత తల్లిదండ్రులపై ఆధారపడి వారిని వేదిస్తూ అలవాటు పడి మధ్యానికి బానిసలు అవుతూ చివరికి గంజాయి మత్తులో యువత వాడు కావడానికి పాలకులే కారకులవుతున్నారు, కోసం వారి స్వార్ధ రాజకీయ ప్రాబల్యం కోసం యువతను నిర్వీర్యం చేస్తున్నారు, ఇదేన ప్రజా పాలన ఇందిరమ్మ రాజ్యం అని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాము,

ఈ దుర్మార్గ పాలన 2014 నుండి నేటి వరకు కొనసాగించడం దురదృష్టకరం,

ఒకవేళ ప్రభుత్వం బెల్ట్ షాపులు మూసివేతకు నిర్ణయం తీసుకోకపోతే మహిళలు తరఫున మహిళలను సమీకరించి పూర్తిగా మద్యపాన నిషేధం కోసం పోరాటాలు సాగించాల్సిన అవశ్యకత ఏర్పడుతుందని తాండ్ర వెంకటేశ్వర్లు హెచ్చరించారు, కనీసం ప్రభుత్వం కళ్లు తెరిచి బెల్టు షాపులు మూసివేసే వరకు బహుజన సమాజ్ పార్టీ పోరాటం చేస్తుందని తెలియజేశారు, జిల్లాలో బాధ్యతయుతమైన ఆఫీసర్గా ఉన్న కలెక్టర్ గారు బాధ్యత రహితంగా ప్రవర్తించడం బెల్ట్ షాపులపై దృష్టి సాధించకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి జిల్లాల పూర్ణచందర్ నియోజకవర్గ కార్యదర్శి బండిపల్లి కిరణ్ పట్టణ నాయకులు నరేష్ తదితరులు పాల్గొన్నారు,

# ఎల్ నినో నేపథ్యంలో ఆరుతడి పంటలనే సాగు చేయాలి

**ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**ఖరీఫ్ పంటను గట్టెక్కిస్తాం...రబీలో మాత్రం వరి వేస్తే కాపాడలేం**

**ఆరుతడి సాగుకు అన్నివిధాలుగా తోడ్పాటును అందిస్తాం**

**కొత్తగా బోరుబావులు తవ్విస్తే సీజ్ చేస్తామని స్పష్టీకరణ**

**నిజామాబాద్, అక్టోబర్ 27 :** ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదైన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా రైతులు రబీలో ఆరుతడి పంటలనే సాగు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు పలికారు. అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూగర్భ జలాల లభ్యత, విద్యుత్ సరఫరా తదితర పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఒకవేళ వరి మినహా ఇతర పంటల సాగుకు చౌడు భూములు వంటి నేల రకాలు సహకరించకపోతే క్రాప్ హాలిడే పాటించాలని, వరి సాగు మాత్రం చేయవద్దని స్పష్టం చేశారు. నందిపేట మండలం నూత్ పల్లి రైతు వేదికలో మంగళవారం ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించగా, కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని రైతులనుద్దేశించి మాట్లాడారు. ఖరీఫ్ లో వేసిన వరి పంట పూర్తి స్థాయిలో చేతికి అందేంత వరకు జిల్లా యంత్రాంగం తరపున కాపాడుతామని రైతులకు భరోసా కల్పించారు. అయితే రబీలో మాత్రం వరి పంటకు సాగు నీరు అందించే పరిస్థితి ఉండదని కలెక్టర్ వెల్లడించారు. సూపర్ ఎల్ నినో ప్రభావంతో ప్రతీకూల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ రంగంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై రైతులకు కీలక సూచనలు చేశారు. వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే పెసలు, మినుములు, శనగతో పాటు జొన్న, మొక్కజొన్న, కూరగాయలు వంటి పంటల సాగును చేపట్టడం ఎంతో శ్రేయస్కరమని రైతులను ప్రోత్సహించారు. బిందు సేద్యాన్ని వినియోగించుకొని ఆయిల్‌పామ్ తోటలు, కూరగాయలు తదితర పంటలను సాగు చేయడం ద్వారా నీటిని పొదుపుగా వినియోగించుకోవచ్చని అన్నారు. ఆరుతడి పంటల సాగుకు ముందుకు వచ్చే రైతాంగానికి ప్రభుత్వ పరంగా జిల్లా యంత్రాంగం తరఫున తోడ్పాటును




అందిస్తామని భరోసా కల్పించారు. మల్చింగ్, బిందు సేద్యం విధానాలకు రాయితీ వర్తించేలా ప్రణాళికలు రూపొందిస్తామని అన్నారు. కూరగాయలు, ఇతర ఆరుతడి పంటలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించే దిశగా కూడా తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. వీబీజీరాంజీ కింద ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, బోరు బావుల రీఛార్జ్ వంటి పనులను చేపట్టి వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించుకోవడంపై దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. అయితే ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో కొత్తగా బోరుబావులు తవ్వకూడదని, ఎవరైనా తవ్విస్తే వాటిని సీజ్ చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రధాన జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటి నిల్వలను తాగునీటి అవసరాలకే వినియోగిస్తామని కలెక్టర్ తెలిపారు. భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయని, రానున్న రోజుల్లో సేద్యానికి కరెంటు సరఫరాకు కూడా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని, యాసంగిలో వరి సాగు చేసి ఇబ్బందుల్లో పడవద్దని జిల్లా పాలనాధికారి హితవు పలికారు. ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక మహిళా సంఘాల ప్రతినిధులు సైతం రబీలో రైతులు ఆరుతడి పంటలే సాగు చేసేలా విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహిస్తూ వారికి అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సందర్భంగా ఆదర్శ రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించగా, రబీలో ఏ తరహా పంటలు సాగు చేయవచ్చు, కరువు పరిస్థితులను అధిగమించేందుకు అనుసరించాల్సిన విధానాలు ఏమిటీ తదితర అంశాలపై వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు రైతులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్ రావు, ఉద్యానవన శాఖ అధికారిణి సంధ్య, సర్పంచ్ రాజిరెడ్డి, స్థానిక అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# మైక్రో సాఫ్ట్ భారత్‌లో 23 వేల మంది ఫైర్డ్..

**హైదరాబాద్ :** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పెరిగిన వ్యయాలు, కంపెనీ పునర్ వ్యవస్థీకరణ వంటి కారణాలతో దిగ్గజ టెక్ కంపెనీలు మాస్ లేఆఫ్స్ చేపడుతున్నాయి. ఇలాంటి తరుణంలో టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ మాత్రం ప్రత్యేక రూట్ ఎంచుకుని, తమ ఉద్యోగులకు వాలంటరీ ఎగ్జిట్ ఆఫర్ ఇచ్చింది. ఒకేసారి 60 వేల మందికి ఈ ఆఫర్ ఇవ్వడంతో చర్చనీయాశంగా మారింది. భారత్‌లోని వివిధ నగరాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు సైతం ఈ వీఈఓ ఆఫర్ వచ్చింది. తెల్లవారి లేచి తమ మెయిల్, మెసేజ్ చెక్ చేసుకుని చాలా మంది షాక్‌కు గురయ్యారు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి అనే ఓ యువతి సైతం తనకు ఎదురైన అనుభవాన్ని సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఆ వివరాలు తెలుసుకుందాం.మీరు ఈ పాటికి మైక్రోసాఫ్ట్ 60 వేల ఉద్యోగులకు వాలంటరీ ఎగ్జిట్ ఆఫర్ ఇచ్చింది అనే న్యూస్ చూసుంటారు. బేసికల్లీ ఇదేంటంటే ఉద్యోగులకు ఒక పరిహారం ఇచ్చి, మీకు సమ్మతమైతే ఈ కాంపెన్సేషన్ తీసుకుని మీ అంతట మీరు రిజైన్ చేయండి అని, ఈ నిర్ణయం తీసుకోవజానికి మీకు 30 రోజుల టైమ్ ఇవ్వడం. నేను నిన్న రాత్రి త్వరగానే పడుకున్నాను. ఉదయం లేచి వాట్సాప్ ఓపెన్ చేస్తే గ్రూప్‌లో వీఈఓ వాలంటరీ ఎగ్జిట్ ఆఫర్ గురించి చర్చించుకుంటున్నారు. నా స్నేహితుల్లో కొందరు ఈ పోర్టల్ చెక్ చేసుకున్నావా? అని నాకు మెసేజ్ చేశారు.అసలు నాకేం అర్థం అయిత లేకుండే. సరే ఇ-మెయిల్ ఏంటో చూద్దాం అని ల్యాప్‌టాప్ ఓపెన్ చేస్తే నా ఇంటర్నెట్ బ్యాలెన్స్ అయిపోయింది. నాన్నకి రీఛార్జ్




చేయమని చెప్పి నేను ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ న్యూస్ గురించి చూస్తుండే. మైక్రోసాఫ్ట్ ఉద్యోగులు కొందరు తమకు సైతం ఈ వీఈఓ ఆఫర్ వచ్చింది అని పోస్ట్ చేశారు. నాకు ఇంకా భయం స్టార్ట్ అయింది. నా గుండె వేగంగా కొట్టుకుంటుంది. ఇంక ల్యాప్ టాప్ తీసుకుని ఆ పోర్టల్ ఓపెన్ చేసిన, నాకు కూడా ఓపెన్ చేయగానే రీవ్యూ యువర్ వీఈఓ ఆఫర్ అని బ్యానర్ కనిపించింది. నాకు అసలు ఏం అర్థం కాలేదు. సడెన్‌గా మొత్తం బ్లాంక్ అయిపోయింది. అసలు ఏంటి ఇది,ఇప్పుడు నేను ఏం చేయాలి, అసలు ఈ ఆఫర్ ఏంటి? అనే ఆలోచనలతో నాకు ఏం అర్థం కాలేదు.ఒకే అని చెప్పి కొంచెం కామ్ అయ్యి, నా సహోద్యోగులు, స్నేహితులకు ఫోన్ చేశాను. పొద్దున 6 గంటలకు ఎవరు లిఫ్ట్ చేస్తారు. ఎవరు లిఫ్ట్ చేయలేదు. అలాగే కాల్ చేస్తుంటే ఆరున్నరకు నా సహోద్యోగి ఒకరు కాల్ లిఫ్ట్ చేసి తనకు సైతం వీఈఓ ఆఫర్ వచ్చింది అని చెప్పిండు. అయితే, నాకు ఇంకా తేలీదు ఎంత మందికి వచ్చింది? ఎవరికి వచ్చింది? అవేం తెలియదు. కొన్ని ఆరోగ్య కారణాలతో గత కొన్ని వారాల నుంచి నేను ఇంట్లో నుంచే పని చేస్తున్నాను. అందుకే వీడియోలు సైతం పోస్ట్ చేయలేదు. నాకు తేలీదు అసలు ఈ ఆఫర్ గురించి ఏంటి, ఏమనుకుంటున్నారు, ఎవరెవరికి వచ్చిందని. ఈరోజు ఆఫీసుకు వెళ్తన్నాను. ఏంటో అసలు నాకు ఏం అర్థం అవ్వట్లేదు. లేఆఫ్స్ సమయంలో ఇది అనుకున్నదే అయినా రియాల్టీలోకి వచ్చినప్పుడు బ్లాంక్ అయిపోతది ఎవరికైనా.ఇంకోటి నాకు బ్రెయిన్‌లో నడుస్తుంది.

## ఉప్పల్‌లో భారీ చోరీ..

## 30 తులాల బంగారం, రూ.6 లక్షలు అపహరణ

ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులు దేవస్థానానికి వెళ్లిన సమయంలో గుర్తుతెలియని దుండగుడు తాళాలు పగలగొట్టి భారీ చోరీకి పాల్పడ్డాడు. ఈ ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూ భరత్‌నగర్ కాలనీలో జరిగింది. దాదాపు 30 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.6 లక్షల నగదును అపహరించినట్లు సమాచారం. కాలనీకి చెందిన భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులు కొమరవెల్లి దేవస్థానానికి వెళ్లారు. ఈ క్రమంలో అర్ధరాత్రి 2 గంటల సమయంలో బుర్కా ధరించిన ఓ వ్యక్తి ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించాడు.బీరువాను తెరిచి బంగారు ఆభరణాలు, నగదును దోచుకెళ్లాడు. దాదాపు గంటపాటు ఇంట్లోనే ఉన్నట్లు సమాచారం. తెల్లవారుజామున ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించిన పనిమనిషి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. దీంతో వారు హుటాహుటిన ఇంటికి చేరుకుని చూడగా, బీరువా తెరిచి ఉండటంతో పాటు సామగ్రి చిందరవందరగా పడి ఉంది. చోరీకి పాల్పడిన వ్యక్తి కదలికలు, తాళాలు పగలగొడుతున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. సమాచారం అందుకున్న ఉప్పల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు

## సివిల్ సప్లయ్ శాఖలో అవినీతి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**హైదరాబాద్** సివిల్ సప్లయ్ శాఖలో అవినీతికి పాల్పడుతున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు వారి అక్రమాస్తులను జప్తు చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మిల్లర్లపై జరుగుతున్న దాడులు, కేసుల నమోదును స్వాగతిస్తున్నామని, అధికారుల అండదండలు లేకుండా మిల్లర్లు అవినీతికి ఎలా పాల్పడతారని ప్రశ్నించారు. వనపర్తి జిల్లాలో అనుమతులు లేవంటూ రెండు రైస్ మిల్లులను కూల్చివేసిన అధికారులు, వాటికి ధాన్యం కేటాయింపులు ఎలా చేశారో సమాధానం చెప్పాలన్నారు. శాఖలోని డీఎంలు, డీఎస్‌వోలు ఒక్కో సీజన్‌లో రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు అక్రమంగా సంపాదిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆరోపించారు. మిల్లర్ల మాదిరిగానే అధికారులపైనా ఏసీబీ, సీఐడీ సోదాలు నిర్వహించాలని కోరారు. అవినీతి అధికారుల అక్రమాస్తులు, బినామీల వివరాలను త్వరలో వెల్లడిస్తామన్నారు. అవినీతిపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, అప్పటివరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## శాంతిభద్రతలు, నేర దర్యాప్తు విభజన దిశగా కీలక ముందడుగు: జోనల్ ఇన్వెస్టిగేషన్ బ్రాంచ్

**పోలీస్ స్టేషన్ల పరిధిలో సంక్లిష్ట కేసుల పరిశోధన కోసమే ప్రత్యేక విభాగం**

**గోల్కొండ జోన్‌లో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించిన నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్,**

**హైదరాబాద్** నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసింగ్ వ్యవస్థలో సరికొత్త సంస్కరణకు శ్రీకారం చుడుతూ 'జోనల్ ఇన్వెస్టిగేషన్ బ్రాంచ్ ' ఏర్పాటైంది. ప్రస్తుతం పోలీస్ స్టేషన్లలో శాంతిభద్రతల పరిరక్షణ (లా అండ్ ఆర్డర్), నేరాల దర్యాప్తు (ఇన్వెస్టిగేషన్) బాధ్యతలను ఒకే సిబ్బంది నిర్వర్తిస్తున్నారు. బందోబస్తులు, నిత్య శాంతిభద్రతల సమస్యల ఒత్తిడి కారణంగా కీలక నేరాల దర్యాప్తుపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించడం క్షేత్రస్థాయిలో సవాలుగా మారుతోంది. ఈ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర పరిశోధన విధులను వేరుచేస్తూ.. తీవ్రమైన, సంక్లిష్టమైన కేసులను పకడ్బందీగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా విచారించేందుకు పైలట్ ప్రాజెక్ట్ కింద జోనల్ ఇన్వెస్టిగేషన్ బ్రాంచ్ అనే ప్రత్యేక విభాగాన్ని అందుబాటులోకి తెచ్చారు. మోహిదీపట్నంలోని గోల్కొండ జోన్ డీసీపీ కార్యాలయ ప్రాంగణంలో జోనల్ ఇన్వెస్టిగేషన్ బ్రాంచ్ ను నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. జోన్ పరిధిలో నమోదయ్యే కీలకమైన, గ్రేవ్ కేసులపైనే ప్రత్యేక దృష్టి సారించి నాణ్యమైన దర్యాప్తు చేయడమే లక్ష్యంగా ఇద్దరు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్లు, ఒక ఎస్సై, ఒక హెడ్ కానిస్టేబుల్, 10 మంది కానిస్టేబుళ్లతో ఈ ప్రత్యేక ఇన్వెస్టిగేషన్ బృందాన్ని తీర్చిదిద్దారు. ముఖ్యంగా హెల్త్, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్, న్యాయ తదితర కీలక ప్రభుత్వ విభాగాలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ.. శాస్త్రీయ ఆధారాలతో పకడ్బందీగా సకాలంలో చార్జిషీట్లను దాఖలు చేయడం, తద్వారా నిందితులకు చట్టప్రకారం న్యాయస్థానాల్లో కఠిన శిక్షలు పడేలా చూడటంలో ఈ బృందం కీలక పాత్ర పోషిస్తుంది. సంక్లిష్ట కేసుల పరిశోధన బాధ్యతను ఈ విభాగం తీసుకోవడం వల్ల స్థానిక పోలీస్ స్టేషన్లపై పని ఒత్తిడి గణనీయంగా తగ్గనుంది. ఈ బ్రాంచ్‌ల ఏర్పాటు వల్ల ఒకవైపు నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ మరింత పటిష్ఠం కావడంతో పాటు.. మరోవైపు నేరాల నియంత్రణకు, కేసుల నాణ్యమైన దర్యాప్తునకు రెట్టింపు బలం చేకూరనుంది. గోల్కొండ జోన్‌లో ప్రారంభించిన ఈ పైలట్ ప్రాజెక్ట్ ఫలితాల ఆధారంగా రాబోయే రోజుల్లో నగరంలోని అన్ని జోన్లకూ ఈ సేవలను విస్తరించనున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సీపీ మాట్లాడుతూ.. బాధితులకు పూర్తిస్థాయిలో సకాలంలో న్యాయం జరిగినప్పుడే పోలీసింగ్ వ్యవస్థకు అసలైన సార్థకత చేకూరుతుందన్నారు. బందోబస్తులు, రోజువారీ పోలీసింగ్ విధుల ప్రభావం కేసుల విచారణపై పడకూడదనే ఏకైక లక్ష్యంతోనే ఈ విభాగాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. కేసు నమోదు మొదలుకుని న్యాయస్థానంలో చార్జిషీటు దాఖలు చేసేంతవరకు ఈ బృందం పూర్తిగా కేసు పరిష్కారంపైనే ఏకాగ్రత చూపుతుందన్నారు. కమిషనరేట్ పరిధిలో గతంలో ఏర్పాటు చేసిన 'ఇన్వెస్టిగేషన్ మానిటరింగ్ సెల్'కు అనుసంధానంగా జోనల్ లెవెల్‌లో గ్రేవ్ కేసుల విచారణను నిరంతరం పర్యవేక్షించేందుకు ఈ బ్రాంచ్ ఒక బలమైన వెన్నుదన్నుగా నిలుస్తుందని పేర్కొన్నారు. పాత సాంప్రదాయ పద్ధతులతో సరిపెట్టకుండా, ఆధునిక శాస్త్రీయ ఆధారాలను మేళవించినప్పుడే కోర్టుల్లో నేర నిరూపణ సాధ్యమై దోషులకు శిక్షలు పడతాయని చెప్పారు. ఈ నూతన విభాగాల ఏర్పాటుతో పోలీస్ స్టేషన్లలోని సిబ్బందిపై తీవ్రమైన కేసుల దర్యాప్తు భారం గణనీయంగా తగ్గుతుందని, తద్వారా వారి సేవల ను క్షేత్రస్థాయిలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు మరింత సమర్థ వంతంగా వినియోగించుకోవచ్చని స్పష్టం చేశారు. గోల్కొండ జోన్‌లో చేపట్టిన ఈ పైలట్ ప్రాజెక్ట్ ఫలితాల ఆధారంగా కమిషనరేట్ పరిధిలోని మిగతా అన్ని జోన్లలోనూ ఈ బ్రాంచీలను ఏర్పాటు చేయనున్నట్లు సీపీ వెల్లడించారు. అదనపు సీపీ లా అండ్ ఆర్డర్ తఫ్సీర్ ఇక్బాల్, గోల్కొండ జోన్ డీసీపీ రీ జె. రాఘవేందర్ రెడ్డి, ట్రాఫిక్ డీసీపీ-1 అవినాశ్ కుమార్, , ట్రాఫిక్ డీసీపీ-2 కాజల్ సింగ్, మహిళా భద్రతా విభాగం డీసీపీ లావణ్య నాయక్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 24 గంటల్లోనే మైనర్ బాలిక ఆచూకీ గుర్తింపు..!

**సాంకేతిక పరిజ్ఞానంతో విజయవాడలో గుర్తించిన మల్కాపురం పోలీసులు..**

**తల్లిదండ్రులకు అప్పగింత**

**విశాఖపట్నం:** ఇంటి నుంచి వెళ్లిపోయిన 16 ఏళ్ల మైనర్ బాలిక ఆచూకీని మల్కాపురం పోలీసులు 24 గంటల్లోనే గుర్తించారు. విజయవాడలో బాలికను గుర్తించి విశాఖపట్నానికి తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. శ్రీహరిపురానికి చెందిన బాలిక సెల్‌ఫోన్ ఎక్కువగా ఉపయోగిస్తోందని కుటుంబ సభ్యులు మందలించడంతో అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు ఈ నెల 25న మల్కాపురం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మల్కాపురం సీఐ నరసింహారావు ఆధ్వర్యంలో, దర్యాప్తు అధికారి ఎస్ఐ అప్పలనాయుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి బాలిక ఆచూకీని విజయవాడలో గుర్తించారు. అనంతరం బాలికను అక్కడి నుంచి తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. తమ కుమార్తెను సురక్షితంగా తిరిగి అప్పగించిన పోలీసులకు బాలిక తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆచంపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభకు హాజరైన డిప్యూటీ కలెక్టర్

**చొప్పదండి** కరీంనగర్ జిల్లా గంగాధర మండలం ఆచంపల్లి గ్రామంలో మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభకు డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి హాజరయ్యారు.ఆచంపల్లి గ్రామ శివారులో ఎస్ వై పి డివిజన్ నంబర్ 5 క్రింద భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం గురించి రైతులకు డిప్యూటి కలెక్టర్ వివరించారు.

## బిజినెస్

### బంగారంపై నడిచే రోజులు వస్తున్నాయ్!



పర్యాటకులను ఆకట్టుకోవడంలో ఎప్పుడూ ముందుండే దుబాయ్.. మరో కొత్త ఆకర్షణకు సిద్ధమవుతోంది. ఈసారి ఏకంగా 24 క్యారెట్ల బంగారంతో నడకదారిని ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుంది. ఇది 2026 చివరి నాటికి అందుబాటులోకి తీసుకురావాలని దుబాయ్ గోల్డ్ డిస్ట్రిక్ట్ భావిస్తోంది. బంగారంతో ఏర్పాటు చేసిన నడకదారి అందుబాటులోకి వస్తే.. ప్రపంచంలోనే మొదటిది, అత్యంత పొడవైన బంగారు నడకదారిగా నిలుస్తుందని నిర్వాహకులు చెబుతున్నారు. దుబాయ్ గోల్డ్ డిస్ట్రిక్ట్ కమర్షియల్ విభాగం సీనియర్ డైరెక్టర్ రషీద్ అల్ హర్మోది వెల్లడించిన వివరాల ప్రకారం.. మరో రెండు నెలల్లోనే దీన్ని ప్రారంభించే అవకాశం ఉంది. బంగారు ఆభరణాలకు ప్రసిద్ధి చెందిన దుబాయ్.. ఇప్పుడు బంగారంతోనే పర్యాటకులను ఆకర్షించేందుకు సన్నద్ధమవుతోంది. ఈ నడకదారి సందర్శకులకు కొత్త అనుభూతిని అందించడంతో పాటు, అంతర్జాతీయ బంగారు వ్యాపార కేంద్రంగా దుబాయ్‌కు ఉన్న గుర్తింపును మరింత పెంచుతుందని అధికారులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా.. జోయాలుక్కాస్ జ్యువెలరీ రూపొందించిన సంప్రదాయ భారతీయ జుంకా చెవిపోగులు కూడా ఇటీవల రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించాయి. ప్రపంచంలోనే అత్యంత బరువైన జత బంగారు చెవిపోగులు, అతిపెద్ద జత చెవిపోగులుగా అవి గుర్తింపు పొందాయి.

### జియో 27 లక్షలు.. ఎయిర్‌టెల్ 26 లక్షలు




ఇంటర్నెట్ డెస్క్: దేశంలోని టెలికాం వినియోగదారుల సంఖ్య సెప్టెంబర్‌లో పెరిగింది. కొత్తగా 65 లక్షల మంది (6.57 మిలియన్) సబ్‌స్క్రైబర్లు చేరారు. దీంతో మొత్తం వినియోగదారుల సంఖ్య 130 కోట్లకు చేరింది. ఈ మేరకు టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ గణాంకాలను వెలువరించింది. సెప్టెంబర్ నెలలో అన్ని టెలికాం కంపెనీలూ తమ సబ్‌స్క్రైబర్ల బేస్‌ను పెంచుకోవడం గమనార్హం. ఎప్పటిలానే జియో ఎయిర్‌టెల్ ముందు వరుసలో నిలిచాయి. సెప్టెంబర్ నెలలో జియో నెట్‌వర్క్‌లోకి 27.12 లక్షల మంది వచ్చారు. దీంతో కంపెనీ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 511.14 మిలియన్లకు (51 కోట్లకు) చేరింది. అదే సమయంలో ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌ను 26.92 లక్షల మంది కొత్తగా ఎంచుకున్నారు. దీంతో మొత్తం సబ్‌స్క్రైబర్ బేస్ 494.29 మిలియన్లకు (49 కోట్లు) పెరిగింది. వొడాఫోన్‌ను కొత్తగా 5.50 లక్షల మంది ఎంచుకోగా.. బీఎస్ఎన్ఎల్‌లో 6.25 లక్షల మంది చేరారు. సెప్టెంబర్ నెలలో 1.6 కోట్ల మంది మొబైల్ నంబర్ పోర్టబిలిటీని ఎంచుకున్నట్లు ట్రాయ్ తెలిపింది.

# ల్యాప్‌టాప్‌లు ఆఫ్.. ఐడీలు డీయాక్టివేట్..
# లంచ్ టైమ్‌లో లేఆఫ్‌లు!

మనుషులు చేసే చాలా పనులు ఏఐ చేస్తోందని, కంపెనీ ప్రాధాన్యతలకు తగ్గట్టుగా ఉద్యోగుల పునర్వ్యవస్థీకరణ అంటూ టెక్ పరిశ్రమలు కొంతకాలంగా లేఆఫ్‌లు ప్రకటిస్తూనే ఉన్నాయి. కొన్ని సంస్థలు ముందుగా సమాచారం ఇస్తుంటే.. ఇంకొన్ని అకస్మాత్తుగా సిబ్బందిని తొలగించి షాక్‌కు గురిచేస్తున్నాయి. తాజాగా ఏఐ సర్వీసెస్, గ్లోబల్ డేటా ఇంజినీరింగ్ సంస్థ ఇన్నోడేటా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉద్యోగులకు ఇలాంటి పరిస్థితే ఎదురైంది. ఎప్పటిలాగే విధుల్లో నిమగ్నమైన పలువురు ఉద్యోగుల ల్యాప్‌టాప్‌లు అనూహ్యంగా లాగౌట్ అయ్యాయని, వారి ఐడీలు డీయాక్టివేట్ అయ్యాయని సోమవారం జరిగిన లేఆఫ్‌ల గురించి ఓ జాతీయ మీడియా కథనం వెల్లడించింది. "ఎప్పటిలాగే మా రోజూవారీ పనిని ప్రారంభించాం. మధ్యాహ్నం సమయంలో ఉద్యోగాల కోత గురించిన వార్తలు ఒక్కసారిగా గుప్పుమన్నాయి. ఆ వెంటనే ఒకరి తర్వాత ఒకరు కంపెనీ సిస్టమ్స్ నుంచి యాక్సెస్ కోల్పోయారు. ఐడీలు డీ-యాక్టివేట్ అయ్యాయి. అనంతరం వ్యక్తిగత ఈ-మెయిల్ ఖాతాలకు తొలగింపు మెయిల్స్ వచ్చాయి" అని ఉద్యోగులను ఉటంకిస్తూ సదరు మీడియా కథనం పేర్కొంది. వ్యాపార అవసరాలకు తగ్గట్టుగా ఈ నిర్ణయం తీసున్నామని, పనితీరు ఆధారంగా తొలగింపులు కాదని ఉద్యోగులకు పంపిన ఈ-మెయిల్‌లో ఆ సంస్థ తెలిపింది.

మొత్తంగా భారత్‌లో 550 మంది సిబ్బందిపై ఈ లేఆఫ్‌ల ప్రభావం పడింది ఫిలిప్పీన్స్‌లోని తన కార్యాలయాల్లో పలువురు ఉద్యోగులను ఇన్నోడేటా తొలగించింది. హెచ్‌ఆర్ యాప్‌నకు యాక్సెస్ కూడా నిలిపివేయడతో ఉద్యోగులు తమ పేస్లిప్‌లు, ఇతర కీలక డాక్యుమెంట్లను డౌన్‌లోడ్ చేసుకునే



అవకాశం కూడా లభించలేదని తెలుస్తోంది. దాంతో బాధితులంతా సోషల్ మీడియాలో ఒక గ్రూప్‌ను ఏర్పాటు చేసుకొని, కంపెనీకి తమ పరిస్థితిని వివరించే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం.

అమెరికాలోని న్యూజెర్సీ కేంద్రంగా ఇన్నోడేటా సేవలందిస్తోంది. టెక్ కంపెనీలకు ఏఐ వ్యవస్థలను నిర్మించడానికి, సేవలను మెరుగుపర్చడానికి సహకరిస్తోంది. గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, యాపిల్, సోనీ, బోయింగ్, డెలాయిట్ వంటి దిగ్గజ సంస్థలు ఈ సంస్థ కస్టమర్ల జాబితాలో ఉన్నాయి. 2025 వార్షిక నివేదిక ప్రకారం.. అంతర్జాతీయంగా ఇన్నోడేటా సంస్థలో 10,107 మంది సిబ్బంది ఉన్నారు.

# జియో ప్లాట్‌ఫామ్స్ లిస్టింగ్.. ఊరిస్తున్న టాప్-2!

ఇంటర్నెట్ డెస్క్: రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన టెలికాం, డిజిటల్ విభాగం జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ అక్టోబరు 28న స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ కానుంది. అప్పర్ ప్రైస్ బ్యాండ్ వద్ద రూ.10.3 లక్షల కోట్ల మార్కెట్ విలువతో బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో నమోదు కానుంది. రూ.10 లక్షల కోట్ల మార్కెట్ విలువతో వస్తున్న తొలి కంపెనీగా జియో రికార్డులకెక్కనుంది. ఇప్పటి వరకు ఏ భారతీయ కంపెనీ కూడా ఈ మార్కెట్ విలువ వద్ద లిస్టింగ్‌కు రాలేదు. ప్రస్తుతం స్టాక్ మార్కెట్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ (రూ.16.2 లక్షల కోట్లు), భారతీ ఎయిర్‌టెల్ (రూ.12.2 లక్షల కోట్లు), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (రూ.10.6 లక్షల కోట్లు) మార్కెట్ విలువ పరంగా టాప్-3లో ఉన్నాయి. ఐపీఓ వాల్యూయేషన్ ప్రకారం జియో ప్లాట్‌ఫామ్స్ నాలుగో అతిపెద్ద కంపెనీగా అవతరించనుంది. జియో ప్లాట్‌ఫామ్స్ షేర్లు ప్రీమియంతో




లిస్టయ్యే అవకాశం ఉన్నట్లు గ్రే మార్కెట్ ప్రీమియం సూచిస్తోంది. ఆ లెక్కన ఇష్యూ ధరతో (రూ.1119) పోలిస్తే 20 శాతం ప్రీమియంతో రూ.1340 వద్ద లిస్టయ్యే అవకాశం ఉందని అంచనాలున్నాయి. అదే జరిగితే కంపెనీ మార్కెట్ విలువ రూ.12.3 లక్షల కోట్లకు చేరుతుంది. దీంతో మార్కెట్ విలువ పరంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ తర్వాత రెండో అతిపెద్ద కంపెనీగా జియో ప్లాట్‌ఫామ్స్ నిలుస్తుంది.

ఐపీఓ వాల్యూయేషన్ ప్రకారం చూసినా రిలయన్స్ ఇండస్ట్రీస్, జియో ప్లాట్‌ఫామ్స్ కంపెనీల మార్కెట్ విలువ రూ.27 లక్షల కోట్లుగా ఉంది. 2026 అక్టోబరు 27నాటికి టాటా గ్రూపునకు చెందిన 32 లిస్టెడ్ కంపెనీల కంబైన్డ్ మార్కెట్ విలువ రూ.25.7 లక్షల కోట్లుగా ఉంది. అదానీ గ్రూపునకు చెందిన 11 లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.16.6 లక్షల కోట్లుగా ఉంది. ఒకవేళ జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ (జేపీఎల్) ప్రీమియం ధర వద్ద లిస్టయితే రిలయన్స్ గ్రూప్ మార్కెట్ విలువ సుమారు రూ.30 లక్షల కోట్లకు చేరుతుంది.

# వెల్లింగ్టన్‌లో అభిషేక్ సునామీ..
# రికార్డుల మోతతో సిరీస్ భారత్ కైవసం

**కివీస్‌పై మూడో టీ20లో టీమిండియా ఘన విజయం**

**యంగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ 38 బంతుల్లోనే 113 పరుగులు**

**పవర్‌ప్లేలో 118 పరుగులు చేసి ప్రపంచ రికార్డు సృష్టించిన భారత్**

**ఈ విజయంతో 3-0 తేడాతో టీ20 సిరీస్‌ను కైవసం చేసుకున్న టీమిండియా**

**భారీ లక్ష్యాన్ని కేవలం 13.2 ఓవర్లలోనే ఛేదించిన భారత జట్టు**





న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో యంగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. పరుగుల సునామీ సృష్టిస్తూ కేవలం 38 బంతుల్లోనే 9 ఫోర్లు, 11 సిక్సర్ల సహాయంతో 113 పరుగులు చేయగా, టీమిండియా మరపురాని విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే 3-0 తేడాతో భారత్ కైవసం చేసుకుంది. కివీస్ నిర్దేశించిన 199 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత బ్యాటర్లు ఊది పారేశారు. అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగడంతో ఈ భారీ స్కోరు కూడా చిన్నబోయింది. ఈ పోరులో భారత్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోగా.. న్యూజిలాండ్ బ్యాటర్లు మెరుగైన ఆటతీరు కనబర్చారు. డారిల్ మిచెల్ (52 బంతుల్లో 89 నాటౌట్), ఫిన్ అలెన్ (25 బంతుల్లో 40) మెరుపు ఇన్నింగ్స్‌లతో ఆతిథ్య నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 198 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, అక్షర్ పటేల్, నితీశ్ రెడ్డి తలో వికెట్ పడగొట్టారు. అనంతరం 199 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ (19 బంతుల్లో 45) కివీస్ బౌలర్లను ఊచకోత కోశారు. వీరిద్దరూ పవర్‌ప్లేలోనే టీ20 క్రికెట్‌లో సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించారు. తొలి 6 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 118 పరుగులు జోడించారు. ఇది టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో అత్యధిక పవర్‌ప్లే స్కోరు కావడం విశేషం. ఈ క్రమంలో రొమేనియా (116/0) రికార్డును భారత్ బద్దలుకొట్టింది. కేవలం 2.2 ఓవర్లలోనే 50 పరుగులు, 5 ఓవర్లలోనే 100 పరుగులు పూర్తి చేసి పలు రికార్డులను తమ ఖాతాలో వేసుకుంది. తొలి వికెట్‌కు 133 పరుగుల భాగస్వామ్యం తర్వాత వైభవ్ ఔటైనా, అభిషేక్ తన జోరు కొనసాగించాడు. విధ్వంసకర ఇన్నింగ్స్‌తో 35 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అనంతరం అభిషేక్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (5), సంజూ శాంసన్ (18) స్వల్ప వ్యవధిలో ఔటయ్యారు. చివర్లో తిలక్ వర్మ (1), నమన్ ధీర్ (4) లాంఛనాన్ని పూర్తి చేశారు. దీంతో టీమిండియా కేవలం 13.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి 6 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయంతో సిరీస్‌ను భారత్ 3-0 చేజిక్కించుకోగా, మిగిలిన రెండు మ్యాచ్‌లు నామమాత్రం కానున్నాయి. అభిషేక్ శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

**మా ప్లాన్ చాలా సింపుల్.. వైభవ్ తో ఓపెనింగ్ పై అభిషేక్ శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు**

న్యూజిలాండ్‌పై ఆకాశమే హద్దుగా చెలరేగి, కేవలం 38 బంతుల్లోనే 113 పరుగులు సాధించి టీమిండియాకు చిరస్మరణీయ విజయాన్ని అందించిన తర్వాత, యువ సంచలనం అభిషేక్ శర్మ తన విధ్వంసక ఇన్నింగ్స్ వెనుక ఉన్న అసలు రహస్యాన్ని పంచుకున్నాడు. తాను, మరో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా ఆడటమే తమ ప్రణాళిక అని, ముఖ్యంగా పవర్‌ప్లేను సద్వినియోగం చేసుకోవాలని ముందే నిర్ణయించుకున్నామని తెలిపాడు. మ్యాచ్ అనంతరం 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు అందుకున్న అభిషేక్ తన మనసులోని మాటలను వెల్లడించాడు. న్యూజిలాండ్ పర్యటనలో భాగంగా వెల్లింగ్టన్‌లోని హెన్రీ స్టేడియంలో జరిగిన మూడో టీ20లో టీమిండియా 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 198 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం 199 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్, అభిషేక్ శర్మ (38 బంతుల్లో 113; 9 ఫోర్లు, 11 సిక్సర్లు) సునామీ సెంచరీతో కేవలం 13.2 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ విజయంతో 5 మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 3-0 తేడాతో కైవసం చేసుకుంది.

## స్పోర్ట్స్

### రంజీ ట్రోఫీ..
### డబుల్ సెంచరీలతో మోతెక్కించిన బ్యాటర్లు



దేశవాళీ టోర్నీ రంజీ ట్రోఫీ 2026-27లో ఆయా జట్ల బ్యాటర్లు డబుల్ సెంచరీలు, శతకాలతో హోరెత్తిస్తున్నారు. ఎలైట్ గ్రూప్-ఏలో జార్ఖండ్‌తో మ్యాచ్‌లో ఢిల్లీ బ్యాటర్ ఆయుశ్ బదోని డబుల్ సెంచరీతో చెలరేగగా, సుమిత్ మాథూర్ సెంచరీ సాధించాడు. తద్వారా ఢిల్లీ భారీ స్కోరు దిశగా సాగుతుంది. ప్రస్తుతం 126 ఓవర్లు ముగిసేసరికి ఢిల్లీ జట్టు 5 వికెట్ల నష్టానికి 474 పరుగులు చేసింది. బదోని (201), సుమిత్ మాథూర్ (118) క్రీజులో ఉన్నారు. ఈ ఇద్దరు ఆరో వికెట్‌కు అజేయంగా రికార్డు స్థాయిలో 293 పరుగులు జోడించడం విశేషం. ఎలైట్ గ్రూప్-డిలో హిమాచల్ ప్రదేశ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో చండీగఢ్ భారీ స్కోరు దిశగా సాగుతున్నది. 118 ఓవర్లు ముగిసేసరికి చండీగఢ్ 2 వికెట్ల నష్టానికి 528 పరుగులు చేసింది. ఓపెనర్ నిహాల్‌పజిని (324 బంతుల్లో 202 బ్యాటింగ్; 23 ఫోర్లు, 2 సిక్సర్లు) అజేయ డబుల్ సెంచరీతో విధ్వంసం సృష్టించగా, అరస్లాన్ ఖాన్ (99) పరుగు తేడాతో సెంచరీ చేజార్చుకున్నాడు.

**ప్రియాన్ష డబుల్.. మహేశ్ సెంచరీ**

ఎలైట్ గ్రూప్-ఏలో భాగంగా జమ్మూ కశ్మీర్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో బరోడా బ్యాటర్ ప్రియాన్ష మోలియా ద్విశతకం మార్క్ సాధించాడు. 354 బంతుల్లో డబుల్ సెంచరీ సాధించిన ప్రియాన్ష ఇన్నింగ్స్‌లో 22 ఫోర్లు, ఒక సిక్సర్ ఉన్నాయి. ప్రస్తుతం బరోడా 128 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 430 పరుగులు చేసింది. మహేశ్ పితియా కూడా 210 బంతుల్లో శతకం మార్క్ అందుకున్నాడు. ఏడో వికెట్‌కు ఈ జోడి అజేయంగా 233 పరుగులు జోడించింది.

**పటీదార్ శతకం..**

ఇక ఎలైట్ గ్రూప్-ఏలో బీహార్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ కెప్టెన్ రజత్ పటీదార్ శతకం సాధించాడు. 133 బంతుల్లో 109 పరుగులు చేసిన పటీదార్ అనూహ్యంగా రనౌట్ అయ్యాడు. అంతకముందు వికెట్ కీపర్ సాక్షమ్ పురోహిత్ (132) కూడా సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఇక మధ్యప్రదేశ్ తమ తొలి ఇన్నింగ్స్‌ను 8 వికెట్ల నష్టానికి 407 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో బీహార్ 99 పరుగులకే కుప్పకూలడంతో, మధ్యప్రదేశ్ 308 పరుగుల భారీ ఆధిక్యంలో నిలిచింది.

**పంజాబ్ 431 ఆలౌట్**

ఎలైట్ గ్రూప్-బిలో హైదరాబాద్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో పంజాబ్ జట్టు 431 పరుగులకు ఆలౌటైంది. సలీల్ అరోరా (151) భారీ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకోగా, చివర్లో రమన్‌దీప్ సింగ్ (52) అర్ధసెంచరీ సాధించాడు. చివర్లో ఉమేశ్ యాదవ్ (37 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. హైదరాబాద్ బౌలర్లలో సీవీ మిలింద్ నాలుగు వికెట్లతో చెలరేగగా, రక్షణ్ మూడు వికెట్లు, తనయ్ త్యాగరాజన్, అనికేత్ రెడ్డిలు ఒక్కో వికెట్ పడగొట్టారు.